www.akshratimes.com

తెలుగు దినపత్రిక

# అక్షర టైమ్స్

మా అక్షరం ప్రజల పక్షం

RNI.NO : APTEL/2022/90211

సంపుటి : 04 సంచిక : 91 పేజీలు : 08, వెల రూ. 1 రూ/ www.akshratimes.com శనివారం 18 - 07 - 2026

Published by ANANTAPURAM : Circulated in Anantapuram, Satya Sai, Vijayavada, Ysr Kadapa, Annamayya, Prakasham, Bapatla,Ntr, Karimnagar,Guntur,East Godavari, West Godavari, Kakinada, Eluru, Sri Potti Sriramulu Nellore, Kurnool



భోజనం చేస్తూ నీళ్లు తాగితే జీర్ణక్రియ మందగిస్తుందన్నది అపోహ

# అర్హులందరికీ రుణాలు అందించడమే లక్ష్యం

- ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు
- నరసరావుపేటపర్యటనలో సీఎం చంద్రబాబు
- రాష్ట్రాన్ని కేంద్రమే ఆదుకుందని సీఎం చంద్రబాబు వ్యాఖ్య
- నరసరావుపేటలో కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్‌తో కలిసి రుణాల పంపిణీ
- వివిధ వర్గాల లబ్ధిదారులకు రూ.3,216 కోట్ల రుణాలు అందజేత
- కేంద్ర సహకారంతో రాష్ట్రంలోని అధిక వడ్డీ అప్పుల రీషెడ్యూల్ చేశామన్న సీఎం
- 2047 నాటికి ఏపీని హెల్తీ, వెల్తీ, హ్యాపీ సొసైటీగా తీర్చిదిద్దుతామని వెల్లడి




**అమరావతి :**

గత ఐదేళ్ల పాలనలో జరిగిన విధ్వంసం నుంచి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని కేంద్ర ప్రభుత్వమే నిలబెట్టిందని, ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్రం అందించిన సహకారంతోనే రాష్ట్రం తిరిగి గాడిన పడుతోందని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. పల్నాడు జిల్లా నరసరావుపేటలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో కలిసి ఆయన 'క్రెడిట్ అవుట్ రీచ్' కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో చంద్రబాబు మాట్లాడుతూ.. కేంద్రం అందిస్తున్న చేయూత వల్లే రాష్ట్రం ఆర్థికంగా నిలదొక్కుకోగలుగుతోందని అన్నారు. అమరావతి, పోలవరం ప్రాజెక్టులతో పాటు విశాఖ స్టీల్ ప్లాంట్ విషయంలోనూ కేంద్రం రాష్ట్రానికి అండగా నిలిచిందని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా కేంద్ర ప్రభుత్వ పథకాల కింద 1,03,246 మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ రూ.3,216 కోట్ల రుణాలను పంపిణీ చేశారు. అనంతరం బాలికలకు సైకిళ్లను అందజేశారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాల అంతిమ లక్ష్యం ప్రజల జీవన ప్రమాణాలు పెంచడమేనని అన్నారు. ఒకప్పుడు రుణాల కోసం బ్యాంకుల చుట్టూ తిరగాల్సి వచ్చేదని, ఇప్పుడు బ్యాంకులే ప్రజల వద్దకు వచ్చి రుణాలు - మిగతా 2 లో

# డబుల్ ఇంజన్ సర్కార్‌తోనే రాష్ట్ర సమగ్రాభివృద్ధి సాధ్యం

- మంగళగిరిలో మంత్రి నారా లోకేశ్
- మంగళగిరిలో రైల్వే స్టేషన్ ప్రారంభోత్సవంలో మంత్రి నారా లోకేశ్ ప్రసంగం
- 91 వేల మెజారిటీతో గెలిపించిన ప్రజల రుణం తీర్చుకుంటానని భావోద్వేగ ప్రసంగం
- డబుల్ ఇంజన్ సర్కార్‌తోనే రాష్ట్ర సమగ్రాభివృద్ధి సాధ్యమని స్పష్టీకరణ
- అమరావతిని ప్రపంచస్థాయి నగరంగా నిర్మిస్తామని, పెట్టుబడులు ఆకర్షిస్తామని హామీ



**అమరావతి :**

"హైదరాబాద్‌ను చూసిన ప్రతిసారీ నాకు అసూయ కలుగుతుంది. అక్కడి విమానాశ్రయం, రైల్వే స్టేషన్లు, ఐటీ టవర్లు చూసినప్పుడు కలిగే ఆ అసూయే.. నాలో కసిని పెంచింది. ఆంధ్రప్రదేశ్‌ను దక్షిణ - మిగతా 2 లో

# గత ప్రభుత్వం చేసిందే ఇప్పుడు కూటమి ప్రభుత్వం చేస్తోంది

- ఏపీ కాంగ్రెస్ చీఫ్ వైఎస్ షర్మిల
- అమ్మఒడి ఒక్క బిడ్డకే ఇచ్చి వైసీపీ మోసం చేసిందన్న షర్మిల
- కూటమి ప్రభుత్వం కూడా తల్లులను మోసం చేస్తోందని విమర్శ
- మిగతా 20 లక్షల మంది బిడ్డలకు పథకాన్ని అందజేయాలని డిమాండ్




**అమరావతి :**

కూటమి ప్రభుత్వంపై ఏపీ కాంగ్రెస్ చీఫ్ వైఎస్ షర్మిల తీవ్ర విమర్శలు గుప్పించారు. "తల్లికి వందనానికి పంగనామం-బిడ్డలకు ఎగనామం" ఇదే కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సూపర్ సిక్స్ హామీ అంటూ ఆమె విమర్శించారు. అంతేకాదు గత ముఖ్యమంత్రి జగన్‌కి వారసుడు నేటి సీఎం చంద్రబాబు అంటూ ఆమె ఎద్దేవా చేశారు. గత వైసీపీ మోసాలను తు.చ తప్పకుండా పాటించడం కూటమి ప్రభుత్వ విధానమైందని మండిపడ్డారు. అమ్మఒడి పేరుతో ఒక్క బిడ్డకే ఇచ్చి వైసీపీ ప్రభుత్వం తల్లులను పచ్చిమోసం చేసిందని వ్యాఖ్యానించారు. "నీకు 15, నీకు 15, ఎంతమంది ఉంటే అన్ని 15 వేలు అని చెప్పిన - మిగతా 2 లో

# త్వరలో ప్లాస్టిక్ కరెన్సీ నోట్లు.. కీలక ప్రయోగానికి ఆర్బీఐ సిద్ధం!

- త్వరలో పాలిమర్ కరెన్సీ నోట్ల ప్రయోగానికి ఆర్బీఐ శ్రీకారం!
- మొదటగా రూ. 10, రూ. వ20 డినామినేషన్లలో పైలట్ ప్రాజెక్టు
- ప్రస్తుత కాగితం నోట్లు యథావిధిగా చలామణి
- 2027 నుంచి పూర్తిస్థాయిలో అందుబాటులోకి తెచ్చే అవకాశం




2 లో

# ఏ దిక్కు నుంచి బుల్లెట్లు దూసుకొస్తాయో ఊహించలేని పరిస్థితి

- పంజాబ్ ప్రభుత్వంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ధ్వజం
- రూ.5,470 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు
- ఆప్ ప్రభుత్వంలో నేరగాళ్లు బహిరంగంగానే బెదిరింపులకు దిగి అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారని ధ్వజం
- పంజాబ్‌లో మార్పును తీసుకురావడం కేవలం బీజేపీ వల్ల సాధ్యమవుతుందన్న ప్రధానమంత్రి నరేంద్రమోదీ
- పంజాబ్ రాష్ట్ర బడ్జెట్‌లో సింహభాగం కేవలం అప్పులు తీర్చడానికే వినియోగిస్తున్నారని వ్యాఖ్య




**ఢిల్లీ :**

పవిత్ర భూమి పంజాబ్‌లో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయని ప్రధాని నరేంద్రమోదీ విమర్శించారు. పంజాబ్‌లోని ఆప్ ప్రభుత్వంలో నేరగాళ్లు బహిరంగంగానే బెదిరింపులకు దిగి అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారని ధ్వజమెత్తారు. అమృత్ భారత్ పథకంలో భాగంగా 20 రాష్ట్రాల్లో అత్యాధునికంగా ఆధునీకరించిన 75 రైల్వేస్టేషన్లను ప్రధాని మోదీ జలంధర్ నుంచి వర్చువల్‌గా ప్రారంభించారు. రూ.5,470 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మాట్లాడిన మోదీ ఆమ్ ఆద్మీ పార్టీ పాలనలో పంజాబ్‌లో అభివృద్ధి పనులన్నీ ఎక్కడికక్కడ నిలిచిపోయాయని ఆరోపించారు. పంజాబ్ రాష్ట్ర బడ్జెట్‌లో సింహభాగం కేవలం అప్పులు తీర్చడానికే వినియోగిస్తున్నారని దుయ్యబట్టారు. ప్రభుత్వాన్ని నడుపుతున్న పెద్దలు ఆ నిధులను తమ సొంత పనులకు వాడుకుంటూ - మిగతా 2 లో

# అట్లాంటిక్‌లో 'లాస్ట్ సిటీ' రహస్యాన్ని ఛేదించిన శాస్త్రవేత్తలు!

- అట్లాంటిక్ సముద్రంలోని 'లాస్ట్ సిటీ' రహస్యంపై వీడిన చిక్కుముడి
- సముద్ర గర్భంలో 1.3 కిలోమీటర్ల లోతున భారీ వేడి నీటి జలాశయం
- భూగర్భంలో 300లీజ ఉష్ణోగ్రతతో కూడిన నీటి ఆనవాళ్లు
- భూమిపై జీవం, గ్రహాంతర జీవంపై అధ్యయనానికి ఇది కీలకం




**ఢిల్లీ :**

అట్లాంటిక్ మహాసముద్ర గర్భంలో దాగి ఉన్న ఓ అద్భుత ప్రపంచం రహస్యాన్ని శాస్త్రవేత్తలు ఛేదించారు. ప్రఖ్యాత 'లాస్ట్ సిటీ' హైడ్రోథర్మల్ ఫీల్డ్ కింద, భూమి పొరల్లోపల అత్యంత వేడి నీటితో కూడిన భారీ జలాశయం ఉన్నట్లు గుర్తించారు. భూమిపై జీవం ఎలా ఆవిర్భవించిందో అర్థం చేసుకోవడానికి, సౌర కుటుంబంలోని ఇతర గ్రహాలపై జీవం ఉనికిని అన్వేషించడానికి ఈ ఆవిష్కరణ మార్గం చూపుతుందని పరిశోధకులు భావిస్తున్నారు. ఇంటర్నేషనల్ ఓషన్ డిస్కవరీ ప్రోగ్రామ్ ఆధ్వర్యంలో 'ఎక్స్‌పెడిషన్ 399' బృందం - మిగతా 2 లో

# బీఆర్ఎస్ 'యువ సంగ్రామ సభ'కు షరతులతో హైకోర్టు గ్రీన్ సిగ్నల్




2 లో

- నేటి బీఆర్ఎస్ 'యువ సంగ్రామ సభ'కు హైకోర్టు అనుమతి
- సరూర్‌నగర్ స్టేడియంలో భారీ బహిరంగ సభ
- పోలీసులు అనుమతి నిరాకరించడంతో కోర్టును ఆశ్రయించిన బీఆర్ఎస్
- శాంతిభద్రతలకు విఘాతం కలిగించకుండా నిర్వహించుకోవాలని స్పష్టమైన షరతులు
- ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించనున్న కేటీఆర్

# ఓటర్ల జాబితా సవరణ తెలంగాణలో 60 శాతం డిజిటలైజేషన్ పూర్తి





- తెలంగాణలో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ వేగవంతం
- రాష్ట్రవ్యాప్తంగా 60 శాతం డిజిటలైజేషన్ పూర్తయినట్టు వెల్లడి
- గ్రామీణ ప్రాంతాల్లో 80, పట్టణాల్లో 45 శాతం పురోగతి
- గడువు పొడిగింపును దృష్టిలో ఉంచుకోవాలని అధికారులకు ఆదేశం

**హైదరాబాద్ :**

తెలంగాణలో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో ఇప్పటివరకు 60 శాతం డిజిటలైజేషన్ పూర్తయిందని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ - మిగతా 2 లో

# ధరణి అక్రమాలపై ప్రత్యేక దర్యాప్తు బృందం ఏర్పాటు

- ముగిసిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశం
- ధరణి భూ వివాదాలపై రాష్ట్రవ్యాప్తంగా వివరాల సేకరణ
- భూ రికార్డుల మార్పులపై సమగ్ర విచారణ
- ప్రభుత్వ, అసైన్డ్, వక్ఫ్, దేవాదాయ భూములపై నిఘా
- అక్రమాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు
- దేవాదుల, చిన్న కాళేశ్వరం ప్రాజెక్టుల వ్యయాల పెంపు
- పాలమూరు-రంగారెడ్డి, సీతారామ ప్రాజెక్టులకు ఆమోదం
- ఇందిరమ్మ ఇళ్ల కోసం భూమి కేటాయింపుకు ఆమోదం
- బుల్లెట్ ట్రైన్ అలైన్‌మెంట్ మార్పుకు మంత్రివర్గం ఆమోదం




**హైదరాబాద్ :**

తెలంగాణ సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన ప్రారంభమైన మంత్రివర్గ సమావేశం ముగిసింది. దాదాపు మూడు గంటల పాటు సాగిన ఈ సమావేశంలో పలు అంశాలపై మంత్రులు చర్చించి కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ధరణి, నీటిపారుదల ప్రాజెక్టులు, బుల్లెట్ ట్రైన్, డిగ్రీ కళాశాలల్లో పోస్టుల భర్తీ, ఇందిరమ్మ ఇళ్లు, గ్రామ పంచాయతీల ఆదాయం వంటి అంశాలు ప్రధానంగా చర్చకు వచ్చాయి. ఈ సమావేశంలో దేవాదుల, చిన్న కాళేశ్వరం, పాలమూరు-రంగారెడ్డి, సీతారామ ప్రాజెక్టుల అంచనా వ్యయాలను పెంచాలని క్యాబినెట్ నిర్ణయించింది. అలాగే జగిత్యాల జిల్లాలోని డిగ్రీ కళాశాలలో పలు పోస్టుల భర్తీకి క్యాబినెట్ ఆమోదం తెలిపింది. సంగారెడ్డి జిల్లా పఠాన్‌చెరులో ఇందిరమ్మ ఇళ్ల కోసం భూమి కేటాయింపునకు క్యాబినెట్ పచ్చజెండా ఊపింది. బుల్లెట్ ట్రైన్ అలైన్‌మెంట్ మార్పునూ మంత్రివర్గం ఆమోదించింది. తెలంగాణ పంచాయతీ రాజ్-2018 చట్ట సవరణకు క్యాబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. గ్రామ పంచాయతీల సొంత ఆదాయం ట్రెజరీలో కాకుండా ఇకపై - మిగతా 2 లో

# సంపాదకీయం

## కల్లోల పశ్చిమాసియా!

అమెరికా--ఇరాన్‌ల మధ్య గతవారం రోజులుగా అడపాదడపా సాగుతున్న దాడులు మంగళవారానికల్లా మరింత ఉగ్రరూపం దాల్చాయి. ఇప్పటికే అమెరికా స్థావరాలపై ఇరాన్ చేసిన దాడులు ఇద్దరు భారతీయ నావికుల ప్రాణాలు తీశాయి. దక్షిణ ఇరాన్‌పై అమెరికా సాగించిన దాడుల్లో 30 మంది పౌరులు, ఏడుగురు సైనికులు మరణించటం, దాదాపు 260 మంది గాయపడటం గమనిస్తే గతానికి మించి ఈసారి పౌర ప్రాంతాలను అమెరికా లక్ష్యంగా చేసుకుందని తెలుస్తుంది. అంతేకాదు... అరుదుగా చేసే పగటిపూట దాడులు కూడా మొదలెట్టింది. ఇరాన్ సైతం అమెరికా మిత్ర దేశాలపై ప్రతీకార దాడులు చేస్తోంది.గత నెల 17న ఇరు దేశాలమధ్యా కుదిరిన శాంతి ఒప్పందంలో అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌కు చిత్తశుద్ధి లేదని అమెరికన్ కాంగ్రెస్‌లోని పాలక, విపక్ష నేతలు గ్రహించారు. యుద్ధం ఎప్పుడో అయిపోయిందని బొంకటం మొదలుకొని కాల్పుల విరమణకు అంగీకారం కుదిరిందని చెప్పడం వరకూ ట్రంప్ ఒక పథకం ప్రకారం నడిపించారు. తన అధికారాలకు పరిమితులు విధిస్తూ యుద్ధ అధికారాల చట్టంకింద సెనేట్‌లోనూ, ప్రతినిధుల సభలోనూ చేసిన రెండు తీర్మానాలతో బెంబేలెత్తిన ట్రంప్ మొదట యుద్ధం ఎప్పుడో ఆగిందని అబద్ధమాడారు. మరికొన్ని రోజులు గడిచాక కాల్పుల విరమణ ఒప్పందం కుదిరిందని, శాంతి ఒప్పందం దిశగా ఇది తొలి అడుగ న్నారు. తీరా ఇప్పుడు మళ్లీ యుద్ధ భేరి మోగించారు.నిజానికి అమెరికా దాడులు ఆపింది ఎప్పుడూ లేదు. ఏదో వంకతో ఇరాన్‌పై కొనసాగిస్తూనే ఉంది. కేవలం కొంత వ్యవధి గడిచింది గనుకే యుద్ధం మొదలైనట్టు అధికారికంగా కాంగ్రెస్‌కు వర్తమానం పంపారు. పర్యవసానంగా 60 రోజులపాటు మళ్లీ యుద్ధం సాగించవచ్చన్నది ఆయన వ్యూహం. ఇది చెల్లుబాటు కాదనీ, ఈ విషయంలో ట్రంప్ ఇష్టారాజ్యం సాగనివ్వబోమనీ ఇరు పార్టీల ప్రతినిధులూ చెబుతున్నది ఆచరణలో ఎంతవరకూ నెరవేరుతుందో చూడాలి. గ్యాస్ ధరలు అపరిమితంగా పెరగటం, ఇతరేతర సరుకులు సైతం అందుబాటులో లేకపోవటంతో జనం బెంబే లెత్తుతుండగా మరిన్ని దాడులతో ఇరాన్ దారి కొస్తుందని ట్రంప్ కలగంటున్నారు. ఇరాన్‌తో లడాయి మొదలయ్యాక గ్యాస్ కోసం అమెరికా ఇంతవరకూ 5,640 కోట్ల డాలర్లు అదనంగా వెచ్చించిందని డెమాక్రాట్ల ఆధ్వర్యంలోని ఉమ్మడి ఆర్థిక కమిటీ అంచనా వేసింది. తాజా పరిణామాలతో వార్షిక రక్షణ విధాన బిల్లు ప్రవేశించకుండా సెనేట్‌లో 50--46 ఓట్ల తేడాతో నిరోధించటంతో ఆయన దిక్కుతోచని స్థితిలో పడ్డారనే చెప్పాలి. సొంత పార్టీకి చెందినవారే అడ్డం తిరగటంతో బిల్లు సభాప్రవేశానికి అవసర మైన 60 ఓట్లు లభించలేదు.హార్మూజ్ జలసంధి విషయంలో ఏం చేయాలో ట్రంప్‌కు పాలుబోవడం లేదని ఆయన పరస్పర విరుద్ధ ప్రకటనలే చెబుతున్నాయి. ఇకపై హార్మూజ్‌లో నౌకల రాక పోకలు సక్రమంగా జరిగేలా చూడటం తమ బాధ్యతనీ, అందుకు 20 శాతం సుంకం వసూలు చేస్తామనీ ప్రకటించి 24 గంటలు గడవకుండా మాట మార్చారు. దేశదేశాల అధినేతలూ అమెరికాలో వందలకోట్ల డాలర్లు పెట్టుబడి పెడతామనటంతో నిర్ణయం మారిందట! అమెరికా, దాని మిత్రపక్షాలూ ఎప్పటిలాగే స్వేచ్ఛాయుత హార్మూజ్ కొన సాగాలని కోరుతూ రాగా, ఇప్పుడు అందుకు విరుద్ధమైన ప్రకటన రిపబ్లికన్లను సైతం దిగ్భ్రమపరిచింది. అంతర్జాతీయ జలరవాణా మార్గంపై ఏ దేశమైనా ఎలా పెత్తనం చేస్తుందన్న వారి ప్రశ్నకు ట్రంప్ దగ్గర జవాబు లేదు.సాధారణ సమయాల్లో హార్మూజ్‌ను రోజుకు 130 రవాణా నౌకలు దాటేవి. అవికాస్తా సోమవారానికి 10కి పడిపోయాయి. తాజా దాడుల తర్వాత అది పూర్తిగా స్తంభించి పోయింది. యుద్ధాలు, అస్థిరత చమురు కార్పొరేషన్లకు అసాధారణ లాభాలు తెస్తాయి. కానీ చమురు, సహజవాయు దిగుమతులపై ఆధారపడ్డ దేశాలు ఆర్థికంగా కుంగి పోతాయి. పర్యావరణ పరిరక్షణ కోసమైనా పునరుత్పాదక ఇంధన వనరులపై దృష్టి కేంద్రీకరిద్దామని ఇన్ని దశాబ్దాలుగా ఏ దేశమూ చిత్తశుద్ధితో అనుకోలేదు. ఎక్కడో ఒకచోట తలెత్తే సంక్షోభానికి ప్రపంచమంతా మూల్యం చెల్లించే ప్రస్తుత విధానం మంచిదో, ప్రత్యామ్నాయ వనరుల ఆసరాతో ఉన్నంతలో మెరుగ్గా మనుగడ సాగించటం ఉత్తమమో ప్రపంచ దేశాలన్నీ తేల్చుకోవటం తప్ప వేరే మార్గం లేదు.



## అర్హులందరికీ రుణాలు అందించడమే లక్ష్యం

**మొదటిపేజీ తరువాయి -** ఇవ్వడం శుభపరిణామమని పేర్కొన్నారు. ఈ రుణమేళా ద్వారా వ్యవసాయ రంగానికి రూ.2,363 కోట్లు, ఎంఎస్ఎంఈలకు రూ.325 కోట్లు, గృహ, విద్య, ఇతర రంగాలకు రూ.624 కోట్లు అందించినట్లు వివరించారు.కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ నాయకత్వ పటిమను చంద్రబాబు ప్రత్యేకంగా ప్రశంసించారు. దేశంలో మొండి బకాయిలపై (ఛీూూ) కఠినంగా వ్యవహరించి, డిజిటల్ బ్యాంకింగ్ విప్లవాన్ని తీసుకొచ్చిన ఘనత ఆమెకే దక్కుతుందన్నారు. జీఎస్టీ విధానంలో మార్పులు చేసి ప్రభుత్వ ఆదాయాన్ని పెంచారని కొనియాడారు. గత ప్రభుత్వ హయాంలో చేసిన అధిక వడ్డీ అప్పులను కేంద్రం సహకారంతో రీషెడ్యూల్ చేశామని, దీని ద్వారా రాష్ట్రానికి రూ.1,538 కోట్ల మేర ఆదా అయిందని తెలిపారు.రాయలసీమను హార్టికల్చర్ హబ్‌గా మార్చేందుకు కేంద్రం రూ.40 వేల కోట్ల సహకారం అందిస్తోందని, ప్రైవేటు పెట్టుబడులతో ఈ ప్రాంతాన్ని ఉద్యానవన కేంద్రంగా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు. రాష్ట్రంలోని డ్వాక్రా మహిళలు పొదుపులో, రుణాల చెల్లింపులో దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నారని, వారిని వ్యాపారవేత్తలుగా మార్చేందుకు 'వన్ ఫ్యామిలీ, వన్ ఎంట్రప్రెన్యూర్' కార్యక్రమాన్ని చేపట్టామని తెలిపారు. 2047 నాటికి ఆంధ్రప్రదేశ్‌ను హెల్తీ, వెల్తీ, హ్యాపీ సొసైటీగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని చంద్రబాబు పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, పలువురు బ్యాంకుల ప్రతినిధులు పాల్గొన్నారు.

## గత ప్రభుత్వం చేసిందే ఇప్పుడు కూటమి ప్రభుత్వం చేస్తోంది

**మొదటిపేజీ తరువాయి -** చంద్రబాబు... ఇప్పుడు చంద్రబాబు తల్లులను నయవంచన చేస్తున్నారని షర్మిల ఆరోపించారు. కోతల రాయుడు కోతలంటూ జగన్ ను ఎద్దేవా చేసిన చంద్రబాబే మళ్లీ కోతలకు బ్రాండ్ అంబాసిడర్ అయ్యారని విమర్శించారు.తల్లికి వందనంపై నిజంగా చంద్రబాబుకు చిత్తశుద్ధి ఉంటే 87 లక్షల మంది బిడ్డలకి ఇవ్వాల్నారు. కోతలు పెట్టకుండా ప్రతి బిడ్డకు 15 వేలు జమ చేయాలన్నారు. కొర్రీలు పెట్టకుండా మిగతా 20 లక్షల మంది బిడ్డలకు పథకాన్ని అందజేయాలని డిమాండ్ చేశారు. గత వైసీపీ పాలనలో అమ్మఒడి పథకం కింద ఒక్కబిడ్డకే ఇచ్చి తల్లులను మోసం చేశారని... ఇప్పుడు కూటమి ప్రభుత్వం కూడా అదే మార్గం అనుసరిస్తోందని షర్మిల ఆరోపించారు. తల్లికి వందనం పథకం కేవలం ఎన్నికల ముందు ఇచ్చిన హామీగా మిగిలిపోయిందని విమర్శించారు.

## 'ఏ దిక్కు నుంచి బుల్లెట్లు దూసుకొస్తాయో ఊహించలేని పరిస్థితి'



**మొదటిపేజీ తరువాయి -** ప్రజాధనంతో విలాసాలు అనుభవిస్తున్నారని ఆరోపించారు. పంజాబ్‌లో మార్పును తీసుకురావడం కేవలం బీజేపీ వల్ల సాధ్యమవుతుందని పునరుద్ఘాటించారు. సుసంపన్నమైన పంజాబ్ నిర్మాణానికి కేంద్రం అంకితభావంతో పనిచేస్తుందని మోదీ భరోసా ఇచ్చారు.పంజాబ్‌లో ఈరోజు ఏం జరుగుతుందో ఎవరికీ తెలియని రహస్యమేమీ కాదు. ఇక్కడ జరుగుతున్న ద్రోహపూరితమైన వాస్తవాలను ప్రకటనల ముసుగులో దాచేందుకు ప్రయత్నిస్తున్నారు. పంజాబ్‌లో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయి. ఎప్పుడు, ఎక్కడ గ్యాంగ్ వార్స్ భగ్గుమంటాయో, ఏ దిక్కు నుంచి బుల్లెట్లు దూసుకొస్తాయో ఎవరూ ఊహించలేని పరిస్థితి నెలకొంది. ఇక్కడ వ్యాపారాలు చేయడం కష్టంగా మారింది. చివరికి పోలీసు స్టేషన్లకు కూడా రక్షణ లేదు. వాటిపై పదేపదే దాడులు జరుగుతున్నాయి. అత్యంత విషాదకరమైన విషయం ఏంటంటే పంజాబ్ భవిష్యత్తు నాశనమవుతోంది. డ్రగ్స్ విక్రేతలు స్వేచ్ఛగా తిరుగుతూ, పంజాబ్ యువతను వ్యసనాల ఊబిలోకి నెట్టేస్తున్నారున్న ప్రధానమంత్రి నరేంద్రమోదీ.

# డబుల్ ఇంజన్ సర్కార్‌తోనే రాష్ట్ర సమగ్రాభివృద్ధి సాధ్యం


**మొదటిపేజీ తరువాయి -** భారతదేశంలోనే నంబర్ వన్ రాష్ట్రంగా తీర్చిదిద్దగలమన్న నమ్మకాన్ని ఇచ్చింది" అని రాష్ట్ర ఐటీ, మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్ శక్తిమంతమైన ప్రసంగం చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శుక్రవారం వర్చువల్ విధానంలో ప్రారంభించిన ఆధునిక హంగులతో కూడిన మంగళగిరి రైల్వే స్టేషన్ ప్రారంభోత్సవ సభలో లోకేశ్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. తన ప్రసంగంలో అభివృద్ధి, రాజకీయాలు, వ్యక్తిగత ప్రస్థానాన్ని కలగలిపి, ప్రజల్లో నూతనోత్సాహం నింపారు.ప్రధాని మోదీ నాయకత్వంలో దేశంలో రైల్వే వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు వస్తున్నాయని లోకేశ్ కొనియాడారు. "ఒకప్పుడు రైళ్లు సమయానికి వచ్చేవి కావు, బోగీలు శుభ్రంగా ఉండేవి కావు. కానీ నేడు వందే భారత్, బుల్లెట్ రైళ్లు, కవచ్ భద్రతా టెక్నాలజీ, 100 శాతం విద్యుదీకరణతో రైల్వే రంగం స్వరూపమే మారిపోయింది. దేశాభివృద్ధికి రైల్వేలే కీలకమని ప్రధాని మోదీ బలంగా విశ్వసిస్తున్నారు" అని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంగళగిరిలో మరిన్ని రైళ్లు ఆగేలా చర్యలు తీసుకోవాలని రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్, కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌ను సభాముఖంగా కోరారు.అమరావతి అభివృద్ధిపై లోకేశ్ తన దార్శనికతను స్పష్టం చేశారు. "రాజధాని అమరావతికి రోడ్డు, రైలు, వాయు మార్గాల అనుసంధానం అత్యంత కీలకం. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారు ఈ మూడింటినీ అనుసంధానిస్తూ ఒక ఇంటిగ్రేటెడ్ లాజిస్టిక్స్ నెట్‌వర్క్‌ను రూపొందిస్తున్నారు. 2019-24 మధ్య ఆగిపోయిన అమరావతి పనులను ఇప్పుడు చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ గారు పరుగులు పెట్టిస్తున్నారు. అమరావతిని ఒక గ్లోబల్ సిటీగా మార్చడమే మా అందరి లక్ష్యం" అని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కేంద్రంలో మోదీ, రాష్ట్రంలో చంద్రబాబు ఉన్న 'డబుల్ ఇంజన్ సర్కార్'తోనే ఇది సాధ్యమని ఆయన అన్నారు. దశాబ్దాల కల అయిన విశాఖ కేంద్రంగా సౌత్ కోస్ట్ రైల్వే జోన్‌ను ప్రధాని మోదీ ఆచరణలోకి తెచ్చారని గుర్తుచేశారు.ఈ సందర్భంగా మంగళగిరితో తనకున్న అనుబంధాన్ని, రాజకీయ ప్రయాణాన్ని లోకేశ్ భావోద్వేగంగా పంచుకున్నారు. "2019లో 5,300 ఓట్లతో ఓడిపోయినప్పుడు కుంగిపోలేదు. ఐదేళ్లు మీ మధ్యనే ఉన్నా, చెమటోడ్చి కష్టపడ్డా, మీ మనసు గెలుచుకున్నా. నేను ఏ మెజారిటీతో అయితే ఓడిపోయానో, దాని పక్కన ఒక సున్నా పెట్టి గెలిపించాలని కోరాను. మీరు నా మాట నిలబెట్టారు. ఆంధ్రప్రదేశ్ చరిత్రలోనే టాప్-3 మెజారిటీతో, 91 వేల ఓట్ల ఆధిక్యంతో నన్ను గెలిపించి శాసనసభకు పంపించారు. ఈ గెలుపు నాకు కొండంత బలాన్నిచ్చింది, నాపై బాధ్యతను పెంచింది" అని అన్నారు. ఈ మెజారిటీని చూపించే కేంద్ర, రాష్ట్ర మంత్రులపై ఒత్తిడి తెచ్చి నియోజకవర్గానికి పనులు చేయిస్తున్నానని తెలిపారు.ఎమ్మెల్యే, ఎంపీ కలిసి పనిచేస్తే ఒక ప్రాంతం ఎంత అద్భుతంగా అభివృద్ధి చెందుతుందో చెప్పడానికి మంగళగిరి ఒక ఉదాహరణ అని లోకేశ్ అన్నారు. ఎంపీ పెమ్మసాని చంద్రశేఖర్‌తో కలిసి పనిచేస్తూ లక్ష్మీ నరసింహ స్వామి గుడి అభివృద్ధికి, భూగర్భ డ్రైనేజీ వంటి పనులకు కేంద్రం నుంచి నిధులు సాధిస్తున్నామని వివరించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఇబ్బందికరంగా ఉన్నా, సంక్షేమం, అభివృద్ధిని జోడెద్దుల బండిలా ముందుకు తీసుకెళుతున్నామని తెలిపారు.రాయల్ ఎన్‌ఫీల్డ్, గూగుల్, అదానీ అంకా వంటి పెద్ద కంపెనీలు ఏపీ వైపు చూస్తున్నాయని, రాబోయే మూడేళ్లలో యువత ఉద్యోగాల కోసం పక్క రాష్ట్రాలకు వెళ్లాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. తనను గెలిపించిన ప్రజల కోసం అహర్నిశలు కష్టపడతానని, వారి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని కోరుతూ లోకేష్ తన ప్రసంగాన్ని ముగించారు.

## త్వరలో ప్లాస్టిక్ కరెన్సీ నోట్లు.. కీలక ప్రయోగానికి ఆర్బీఐ సిద్ధం!



**మొదటిపేజీ తరువాయి -** దేశంలో పాలిమర్ (ప్లాస్టిక్) కరెన్సీ నోట్లను ప్రయోగాత్మకంగా ప్రవేశపెట్టే దిశగా భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్బీఐ) కసరత్తు చేస్తోంది. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం, ఈ పైలట్ ప్రాజెక్టును త్వరలోనే ప్రారంభించి, 2027 నాటికి పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకువచ్చే అవకాశమున్నట్లు తెలుస్తోంది.తొలి దశలో భాగంగా రూ. 10, రూ. 20 వంటి తక్కువ ముఖ విలువ కలిగిన నోట్లతో ఈ ప్రయోగాన్ని ప్రారంభించాలని ఆర్బీఐ యోచిస్తోంది. ప్రస్తుతం చలామణిలో ఉన్న కాగితపు నోట్లను రద్దు చేయకుండానే, దశలవారీగా ఈ కొత్త పాలిమర్ నోట్లను అందుబాటులోకి తీసుకురానున్నారు. ఇందులో భాగంగా అత్యాధునిక భద్రతా ప్రమాణాలతో కూడిన పాలిమర్ షీట్లను సరఫరా చేసేందుకు ఆర్బీఐ నోట్ల ముద్రణ విభాగం ఇప్పటికే గ్లోబల్ ఎక్స్‌ప్రెషన్ ఆఫ్ ఇంట్రెస్ట్ (ఈవోఐ) జారీ చేసింది. బిడ్లు దాఖలుకు ఆగస్టు 18ని తుది గడువుగా నిర్ణయించింది.దేశంలో యూపీఐ వంటి డిజిటల్ చెల్లింపులు గణనీయంగా పెరిగినప్పటికీ, నగదు వినియోగం మాత్రం తగ్గలేదు. దీనికి తోడు పాత నోట్ల స్థానంలో కొత్త వాటిని ముద్రించడం వల్ల ముద్రణా వ్యయం భారంగా మారుతోంది. ఈ నేపథ్యంలో కాటన్‌తో తయారు చేసే కాగితపు నోట్లకు బదులు, ప్లాస్టిక్ ఆధారిత పాలిమర్ నోట్లను తీసుకురావడం ద్వారా ఖర్చును తగ్గించుకోవచ్చని ఆర్బీఐ భావిస్తోంది. ఈ నోట్లు ఎక్కువ కాలం మన్నడమే కాకుండా నీరు, మురికి వంటి వాటికి త్వరగా పాడవవు. ఇప్పటికే ఆస్ట్రేలియా, యూకే, కెనడా వంటి దేశాల్లో ఇవి విజయవంతంగా చలామణిలో ఉన్నాయి.గతంలో 2012-14 మధ్య కాలంలోనే ఆర్బీఐ ఈ ప్రతిపాదన చేసినప్పటికీ, కొన్ని సాంకేతిక కారణాల వల్ల అది కార్యరూపం దాల్చలేదు. ఇప్పుడు మళ్లీ ఈ అంశంపై దృష్టి సారించిన కేంద్ర బ్యాంక్, ఏటీఎంలలో వీటి అనుకూలత వంటి సాంకేతిక అంశాలను పరిశీలిస్తూ పైలట్ ప్రాజెక్టుకు సిద్ధమవుతోంది. అయితే, దీనిపై ఆర్బీఐ నుంచి అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.

## అట్లాంటిక్‌లో 'లాస్ట్ సిటీ' రహస్యాన్ని ఛేదించిన శాస్త్రవేత్తలు!




**మొదటిపేజీ తరువాయి -** ఈ పరిశోధన చేపట్టింది. అట్లాంటిస్ మాసిఫ్ ప్రాంతంలో, సముద్ర గర్భం నుంచి సుమారు 1.3 కిలోమీటర్ల (4,265 అడుగులు) లోతు వరకు డ్రిల్లింగ్ చేసి నమూనాలను సేకరించారు. అక్కడ కనీసం 300 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతతో కూడిన నీటి ఆనవాళ్లను కనుగొన్నారు. ఈ నీటిలో మెగ్నీషియం తక్కువగా, కాల్షియం, లిథియం వంటివి అధికంగా ఉండటాన్ని గమనించారు. ఈ రసాయన లక్షణాలు, లాస్ట్ సిటీ నుండి వెలువడుతున్న హైడ్రోజన్, మీథేన్ అధికంగా ఉండే నీటిని పోలి ఉన్నాయి.'లాస్ట్ సిటీ' అనేది సూర్యరశ్మిపై ఆధారపడని ఒక ప్రత్యేక జీవావరణం. ఇక్కడ సముద్రపు నీరు, భూమి లోపలి రాళ్లతో చర్య జరపడం ద్వారా 'సెర్పెంటినైజేషన్' అనే ప్రక్రియలో హైడ్రోజన్, మీథేన్ వాయువులు విడుదలవుతాయి. ఈ రసాయన శక్తే అక్కడి సూక్ష్మజీవులకు ఆధారం. తాజాగా కనుగొన్న భూగర్భ జలాశయమే ఈ శక్తికి మూలమని శాస్త్రవేత్తలు నిర్ధారణకు వస్తున్నారు. కొన్ని బిలియన్ సంవత్సరాల క్రితం భూమిపై జీవం ఇలాంటి చీకటి వాతావరణంలోనే పుట్టి ఉండవచ్చని ఈ పరిశోధన సూచిస్తోంది. అలాగే, యూరోపా, ఎన్సెలాడస్ వంటి మంచుతో కప్పబడిన గ్రహాలపై కూడా జీవం ఉండేందుకు ఆస్కారం ఉందని అంచనా వేస్తున్నారు.ప్రస్తుతం సేకరించిన నమూనాలలో సముద్రపు నీరు, డ్రిల్లింగ్ ద్రవాలు కలిసినందున మరింత లోతైన విశ్లేషణ అవసరమని శాస్త్రవేత్తలు తెలిపారు. త్వరలోనే ఈ ప్రదేశానికి మళ్లీ వెళ్లి స్థిరమైన నమూనాలను సేకరించి, మరిన్ని పరిశోధనలు చేస్తామని వారు వివరించారు. ఈ అధ్యయన వివరాలు 'జియోకెమిస్ట్రీ, జియోఫిజిక్స్, జియోసిస్టమ్స్' అనే జర్నల్‌లో ప్రచురితమయ్యాయి.

## బీఆర్ఎస్ 'యువ సంగ్రామ సభ'కు షరతులతో హైకోర్టు గ్రీన్ సిగ్నల్

**మొదటిపేజీ తరువాయి -** భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) శనివారం హైదరాబాద్‌లో నిర్వహించ తలపెట్టిన 'యువ సంగ్రామ సభ'కు తెలంగాణ హైకోర్టు షరతులతో కూడిన అనుమతి మంజూరు చేసింది. సరూర్‌నగర్ స్టేడియంలో జరగనున్న ఈ సభకు పోలీసులు అనుమతి నిరాకరించడంతో, బీఆర్ఎస్ శుక్రవారం హైకోర్టును ఆశ్రయించింది. లంచ్ మోషన్ పిటిషన్‌పై విచారణ చేపట్టిన న్యాయస్థానం, శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా సభ నిర్వహించాలని స్పష్టం చేస్తూ అనుమతించింది.ఎన్నికల సమయంలో యువతకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ ఈ సభను నిర్వహిస్తోంది. ముఖ్యంగా ప్రియాంక గాంధీ ప్రకటించిన 'యూత్ డిక్లరేషన్' అమలు, నిరుద్యోగ సమస్య, ప్రభుత్వ ఉద్యోగాల భర్తీలో జాప్యం వంటి అంశాలను ఈ సభ ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని పార్టీ లక్ష్యంగా పెట్టుకుంది. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఈ సభలో ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించనున్నారు.కోర్టులో విచారణ సందర్భంగా, ఇంటెలిజెన్స్ నివేదికల ప్రకారం శాంతిభద్రతల సమస్యలు తలెత్తవచ్చని, పార్కింగ్ సౌకర్యం కూడా సరిగా లేదని ప్రభుత్వ న్యాయవాది కోర్టుకు తెలిపారు. దీనిపై స్పందించిన న్యాయస్థానం, 17 రోజుల క్రితమే దరఖాస్తు చేసుకున్నా ఎందుకు నిర్ణయం తీసుకోలేదని అధికారులను ప్రశ్నించింది. చివరికు, రోడ్లను దిగ్బంధించడం లేదా రెచ్చగొట్టే చర్యలకు పాల్పడకుండా సభను శాంతియుతంగా నిర్వహించాలని బీఆర్ఎస్‌కు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది.

## ఓటర్ల జాబితా సవరణ తెలంగాణలో 60 శాతం డిజిటలైజేషన్ పూర్తి




**మొదటిపేజీ తరువాయి -** సుదర్శన్ రెడ్డి వెల్లడించారు. ఈ ప్రక్రియ గ్రామీణ ప్రాంతాల్లో 80 శాతం పూర్తి కాగా, పట్టణ ప్రాంతాల్లో 45 శాతం మేర పురోగతి సాధించిందని ఆయన తెలిపారు.సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు నియోజకవర్గం పరిధిలోని సుల్తాన్‌పూర్, ఐలాపూర్, పటాన్‌చెరు ప్రాంతాల్లో బూత్ లెవల్ అధికారులు (బీఎల్‌ఓలు) నిర్వహిస్తున్న ప్రత్యేక సవరణ క్యాంపులను జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్‌తో కలిసి ఆయన శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా సవరణ ప్రక్రియ జరుగుతున్న తీరును బీఎల్‌ఓలను అడిగి తెలుసుకున్నారు.శిబిరాల వద్ద ఉన్న వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కమిషనర్ మాట్లాడారు. వారికి పార్టీలు తరపున గుర్తింపు కార్డులు జారీ అయ్యాయా అన్న అంశంపై ఆరా తీశారు. రాజకీయ పార్టీల ఏజెంట్లు, బీఎల్‌ఓల సమన్వయంతో ఈ ప్రక్రియ కొనసాగుతోందని పేర్కొన్నారు. పొడిగించిన గడువును దృష్టిలో ఉంచుకుని సవరణ ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఎన్యూమరేషన్ ఫారాలు అందుబాటులో లేని పక్షంలో, వాటిని వెంటనే సూపర్ వైజర్ల నుంచి సేకరించాలని ఆయన ఆదేశించారు.

## ధరణి అక్రమాలపై ప్రత్యేక దర్యాప్తు బృందం ఏర్పాటు



**మొదటిపేజీ తరువాయి -** నేరుగా జీపీ బ్యాంకు ఖాతాలోనే జమయ్యేలా 70(3) సెక్షన్ సవరణకు పచ్చజెండా ఊపింది. ఈ మేరకు త్వరలో ఆర్డినెన్స్ జారీ చేసే అవకాశం ఉంది. ముఖ్యంగా ధరణి పోర్టల్ అక్రమాలపై ప్రత్యేక దర్యాప్తు బృందం ఏర్పాటు చేయాలని క్యాబినెట్ నిర్ణయించింది. ధరణి ప్రారంభమైన నాటి నుంచి ఇప్పటివరకు జరిగిన అక్రమాలపై సిట్ ద్వారా దర్యాప్తు చేయించాలని తీర్మానించింది.మరోవైపు, మంత్రిమండలి నిర్ణయంతో సిట్ ఏర్పాటుకు కాంగ్రెస్ ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. సిట్ ద్వారా భూ రికార్డుల మార్పులు, అక్రమ మ్యుటేషన్లపై విచారణ చేపట్టాలని భావిస్తోంది. ప్రభుత్వ, అసైన్డ్, వక్ఫ్, దేవాదాయ భూముల లావాదేవీలపైనా ప్రత్యేక దృష్టి సారించనుంది. అక్రమాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. అవసరమైతే మాజీ అధికారులు, బాధ్యులకు నోటీసులు జారీ చేయాలని భావిస్తోంది. సాంకేతిక అంశాలపై నిపుణుల సహకారంతో దర్యాప్తు చేపట్టాలని నిర్ణయించింది. ధరణి ద్వారా జరిగిన భూ వివాదాలన్నింటిపైనా వివరాల సేకరణకు కసరత్తు చేస్తోంది. అక్రమంగా లబ్ధి పొందిన వారిపై కేసులు నమోదు చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు రాష్ట్రవ్యాప్తంగా ఫిర్యాదులు, సంబంధిత పత్రాల పరిశీలనను ప్రారంభించాలని తీర్మానించింది. ఈ మేరకు సిట్ ద్వారా ధరణి అక్రమాలపై వాస్తవాలను వెలుగులోకి తీసుకురావడానికి ప్రభుత్వం ప్రయత్నాలను ముమ్మరం చేసింది.

## ఫిఫా వరల్డ్ కప్ ఫైనల్ సందర్భంగా తెలంగాణ సర్కార్ కీలక నిర్ణయం

**బార్ల సమయం పొడిగింపు**

**ఫిఫా వరల్డ్ కప్ ఫైనల్ సందర్భంగా హైదరాబాద్‌లో బార్ల వేళల పొడిగింపు**

**ఫైనల్ మ్యాచ్ రోజు తెల్లవారుజాము 3 గంటల వరకు మద్యం సరఫరాకు అనుమతి**

**మూడో స్థానం మ్యాచ్ కోసం తెల్లవారుజాము 4:30 గంటల వరకు పర్మిషన్**

**ఫుట్‌బాల్ అభిమానుల విజ్ఞప్తి మేరకు తెలంగాణ ప్రభుత్వ నిర్ణయం**

**బార్ అండ్ రెస్టారెంట్స్ ఓనర్స్ అసోసియేషన్ అభ్యర్థనకు ఆమోదం**




ఫిఫా ప్రపంచ కప్ 2026 తుది అంకానికి చేరుకున్న నేపథ్యంలో, హైదరాబాద్‌లోని ఫుట్‌బాల్ అభిమానులకు తెలంగాణ ప్రభుత్వం తీపి కబురు అందించింది. ప్రపంచ కప్ ఫైనల్ పోరుతో పాటు మూడో స్థానం కోసం జరిగే మ్యాచ్‌ల దృష్ట్యా, గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని బార్లు, క్లబ్బులు, మైక్రో బ్రూవరీలను నిర్ణీత సమయం కంటే అదనంగా తెరిచి ఉంచేందుకు అనుమతినిచ్చింది.రాష్ట్ర ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ శుక్రవారం జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం, జూలై 18 రాత్రి మూడో స్థానం కోసం జరిగే మ్యాచ్ సందర్భంగా తెల్లవారుజామున 4:30 గంటల వరకు మద్యం సరఫరాకు వెసులుబాటు కల్పించారు. అలాగే, జూలై 19న అర్జెంటీనా, స్పెయిన్ జట్ల మధ్య రాత్రి జరగనున్న ఫైనల్ మ్యాచ్ కోసం తెల్లవారుజామున 3 గంటల వరకు బార్లను తెరిచి ఉంచేందుకు అనుమతించారు.ఫిఫా ప్రపంచకప్ మ్యాచ్‌లు భారత కాలమానం ప్రకారం అర్ధరాత్రి లేదా ఆ తర్వాత ప్రారంభమవుతుండటంతో అభిమానులు తమ ఇళ్లకే పరిమితం కావాల్సి వస్తోంది. పబ్లిక్ ప్లేసుల్లో ఇతరులతో కలిసి బిగ్ స్క్రీన్లపై వీక్షించే అవకాశం లేకుండా పోయింది. ఈ క్రమంలో బార్ల పనివేళలను పొడిగించాలని తెలంగాణ బార్ అండ్ రెస్టారెంట్స్ ఓనర్స్ అసోసియేషన్ జూలై 14న ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. దీనిపై సానుకూలంగా స్పందించిన రెవెన్యూ శాఖ తాజాగా అనుమతులు మంజూరు చేయగా, ఎక్సైజ్ కమిషనర్ సి. హరికిరణ్ సంబంధిత అధికారులకు ఉత్తర్వులు జారీ చేశారు.ప్రభుత్వ నిర్ణయంతో ఫుట్‌బాల్ ప్రేమికులు స్నేహితులతో కలిసి బిగ్ స్క్రీన్‌లపై మ్యాచ్‌లను తిలకిస్తూ ఆనందించే అవకాశం లభించింది. అయితే, పొడిగించిన పనివేళల్లో ప్రభుత్వ నిబంధనలను కచ్చితంగా పాటించాలని, భద్రతా ప్రమాణాల విషయంలో ఎటువంటి రాజీ పడకూడదని అధికారులు స్పష్టం చేశారు.

# రాష్ట్ర వడ్డెర కార్పొరేషన్ చైర్మన్ గుంజ రేణుక నారాయణకు ఘన సన్మానం

**మర్యాదపూర్వకంగా కలిసిన రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ సెక్రటరీ ముద్దంగుల తిరుపతి బృందం**

**శేరిలింగంపల్లి,జులై 17 .అక్షర టైమ్స్ : (ప్రతినిధి ఎం.ఈరన్న)** తెలంగాణ రాష్ట్ర వడ్డెర కోఆపరేటివ్ కార్పొరేషన్ లిమిటెడ్ చైర్మన్‌గా నూతనంగా నియమితులైన గుంజ రేణుక నారాయణను రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ కమిటీ సెక్రటరీ, శేరిలింగంపల్లి వడ్డెర సంఘం అధ్యక్షులు ముద్దంగుల తిరుపతి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా గుంజ రేణుక నారాయణ గారి నివాసంలో వారిని కలిసి పూలబొకే అందజేసి, శాలువాతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. కాంగ్రెస్ అధిష్టానానికి ధన్యవాదాలు వడ్డెర కార్పొరేషన్ చైర్మన్‌గా గుంజ రేణుక నారాయణను నియమించినందుకు గాను కాంగ్రెస్ నాయకత్వానికి ఈ సందర్భంగా వారు కృతజ్ఞతలు తెలిపారు. ఈ నియామకానికి సహకరించిన: తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ రాష్ట్ర



ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి టీపీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ మరియు కాంగ్రెస్ పార్టీ అధినాయకత్వానికి వారు తమ హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. పాల్గొన్న ముఖ్య నాయకులు ఈ అభినందనల కార్యక్రమంలో పలువురు కీలక కాంగ్రెస్ నాయకులు మరియు కార్మిక సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. వారిలో: రమేష్ మంజలేకర్ (అఖిల భారత వడ్డెర సంక్షేమ సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు, కాంగ్రెస్ నాయకులు) నల్ల సంజీవరెడ్డి (శ్రామిక శక్తి అవార్డు గ్రహీత, తెలంగాణ రాష్ట్ర ఐఎన్‌టీయూసీ, టీపీసీసీ లేబర్ సెల్ వైస్ చైర్మన్) వీరమల్ల వీరేందర్ గౌడ్ (టీపీసీసీ లేబర్ సెల్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ) ఉయ్యూరు శ్రీదేవి (శ్రమశక్తి అవార్డు గ్రహీత, టీపీసీసీ లేబర్ సెల్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ, శేరిలింగంపల్లి నియోజకవర్గం ఏ-బ్లాక్ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు) మాదిరెడ్డి మోహన్ రెడ్డి (శేరిలింగంపల్లి నియోజకవర్గం టీపీసీసీ లేబర్ సెల్ అధ్యక్షులు) కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు తమ్మలి మాణిక్యం, బ్రహ్మానందం, నాగరాజు, ఉయ్యూరు రామారావు తదితరులు పాల్గొని నూతన చైర్మన్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

## ఓటరు జాబితా ప్రత్యేక సవరణపై ముమ్మరంగా క్షేత్రస్థాయిలో అధికారులతో
# కలిసి స్వయంగా పర్యవేక్షించిన ఎన్నికల నమోదు అధికారి నారాయణ్ అమిత్ ఐఏఎస్

**శేరిలింగంపల్లి,జులై 17 .అక్షర టైమ్స్ : (ప్రతినిధి ఎం.ఈరన్న)** శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలో జరుగుతున్న ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమంలో భాగంగా క్షేత్రస్థాయి పనుల పురోగతిని గౌరవనీయులైన ఎన్నికల నమోదు అధికారి నారాయణ్ అమిత్ ఐఏఎస్ గారు ఇతర అధికారులతో కలిసి నేడు స్వయంగా విస్తృతంగా పర్యటించి పరిశీలించారు.

**పరిశీలించిన ప్రాంతాలు:**

మస్జిద్‌బండ, కొండాపూర్, జైన్ కాలనీ, గచ్చిబౌలి, టెలికాం నగర్, గౌతమి ఎన్‌క్లేవ్ మరియు రాఘవేంద్ర కాలనీ తదితర ప్రాంతాలలో క్షేత్రస్థాయి పరిశీలన సాగింది.

సమీక్షలో ప్రధాన అంశాలు:

**సమాచార పత్రాల పంపిణీ, సేకరణ మరియు కంప్యూటరీకరణ:**

ఇంటింటి సర్వే ద్వారా సేకరించిన వివరాల పత్రాలను ఎప్పటికప్పుడు కంప్యూటరీకరించి, అంతర్జాల పద్ధతిలో నమోదు చేస్తున్న తీరును అధికారులు స్వయంగా పర్యవేక్షించారు. పెండింగ్‌లో ఏవీ ఉంచకుండా రోజువారీగా నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయాలని ఆదేశించారు.

**క్షేత్రస్థాయి తనిఖీ:**

పోలింగ్ కేంద్రాల అధికారులు మరియు పర్యవేక్షకులు చేస్తున్న



తనిఖీ పనులను నోడల్ అధికారులు ప్రత్యక్షంగా పరిశీలించారు. కొత్తగా వచ్చి చేరిన కుటుంబాలు, వలస వెళ్లిన వారు, మరణించిన వారి వివరాలను ఖచ్చితంగా నమోదు చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రెండు చోట్ల పేర్లు నమోదు కాకుండా, తప్పుడు సమాచారం లేకుండా చూడాలని ఆదేశించారు.

**అర్హులైన ఓటర్లందరికీ అవకాశం:**

నిర్దేశిత గడువులోపు అర్హులైన ప్రతి పౌరుడి పేరు ఓటరు జాబితాలో నమోదయ్యేలా చూడాలని అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ప్రత్యేకించి 18 సంవత్సరాలు నిండిన యువత, కొత్తగా నివాసం ఉంటున్న వారిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని తెలిపారు.



**ప్రజల్లో చైతన్యం:**

ఓటరు జాబితా ప్రత్యేక సవరణ యొక్క ప్రాముఖ్యతను ప్రజలకు వివరించి, వారి సహకారంతో ఈ ప్రక్రియను విజయవంతం చేయాలని అధికారులను కోరారు. ప్రజల సందేహాలను తక్షణమే నివృత్తి చేసేందుకు సహాయ కేంద్రాలను అందుబాటులో ఉంచాలని సూచించారు. పరస్పర సమన్వయంతో, బాధ్యతతో పనిచేసి ఎలాంటి తప్పులు లేని స్వచ్ఛమైన ఓటరు జాబితాను రూపొందించడమే మన ప్రధాన లక్ష్యమని గౌరవనీయులైన ఎన్నికల నమోదు అధికారి నారాయణ్ అమిత్ ఐఏఎస్ గారు స్పష్టం చేశారు.

# చెత్తకు చెక్.. పరిశుభ్ర నగరానికి కమిషనర్ కార్యాచరణ

**నాగారం,జులై 17 .అక్షర టైమ్స్ : ప్రతినిధి గోపగాని పాండు)** మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఘన వ్యర్థాల నిర్వహణను పూర్తిస్థాయిలో శాస్త్రీయ విధానంలో చేపట్టి పరిశుభ్రమైన, కాలుష్యరహిత వాతావరణం కల్పించేందుకు అన్ని చర్యలను వేగవంతం చేయాలని కార్పొరేషన్ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. ఘట్‌కేసర్ సర్కిల్‌లో పలు ఘన వ్యర్థాల ప్రాసెసింగ్ కేంద్రాలను శుక్రవారం ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించి అధికారులతో సమీక్ష నిర్వహించారు.ముందుగా కరీంగూడలో ఏర్పాటు చేసిన కొబ్బరి పీచు వ్యర్థాల ప్రాసెసింగ్ కేంద్రాన్ని పరిశీలించిన కమిషనర్, వ్యర్థాలను శాస్త్రీయంగా శుద్ధి చేసి తిరిగి ఉపయోగపడే ఉత్పత్తులుగా మార్చే ప్రక్రియను మరింత సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. అనంతరం నాగారం వార్డులోని పచ్చ వ్యర్థాల ప్రాసెసింగ్ కేంద్రాన్ని సందర్శించి చెట్ల కొమ్మలు, ఆకులు, ఉద్యానవన వ్యర్థాలను సక్రమంగా ప్రాసెస్ చేసి సేంద్రియ ఎరువుగా వినియోగించే విధానాన్ని మరింత విస్తరించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. కార్పొరేషన్ పరిధిలో ఉత్పత్తి అవుతున్న వ్యర్థాలను డంపింగ్ యార్డులకు తరలించే విధానానికి బదులుగా, స్థానికంగానే శాస్త్రీయ పద్ధతిలో ప్రాసెస్ చేసి తిరిగి వినియోగంలోకి



తీసుకురావడం ద్వారా పర్యావరణ పరిరక్షణతో పాటు పరిశుభ్రతను మెరుగుపరచవచ్చని కమిషనర్ పేర్కొన్నారు. ఇందుకోసం అవసరమైన చోట్ల ఇలాంటి ప్రాసెసింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసే దిశగా కార్యాచరణ రూపొందించాలని అధికారులను ఆదేశించారు.అనంతరం రాంపల్లి సమీపంలో ప్రతిపాదించిన నిర్మాణ, కూల్చివేత వ్యర్థాల ప్రాసెసింగ్ కేంద్రం కోసం గుర్తించిన స్థలాన్ని పరిశీలించారు. నిర్మాణ వ్యర్థాలను శాస్త్రీయంగా ప్రాసెస్ చేసి తిరిగి నిర్మాణ రంగంలో వినియోగించే అవకాశాలను సద్వినియోగం చేసుకునేలా ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. తదుపరి



ఘట్‌కేసర్ వార్డు కొండాపూర్‌లో కొనసాగుతున్న జీవ గనుల ప్రక్రియను పరిశీలించిన కమిషనర్, పాత వ్యర్థాలను శాస్త్రీయంగా వేరు చేసి భూమిని పునరుద్ధరించే పనులను నిర్ణీత గడువులో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఘన వ్యర్థాల నిర్వహణలో ఎక్కడా నిర్లక్ష్యానికి తావులేకుండా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ పర్యావరణహిత చర్యలను మరింత వేగవంతం చేయాలని స్పష్టం చేశారు.ఈ పరిశీలనలో అదనపు కమిషనర్ (ఆరోగ్యం--పారిశుద్ధ్యం) రఘు ప్రసాద్, ఘట్‌కేసర్ డిప్యూటీ కమిషనర్ వాణి, ఘన వ్యర్థాల నిర్వహణ విభాగం డీఈఈ శ్రీనివాస్, ఏఈఈ చంద్రశేఖర్‌తో పాటు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో 851 కోట్లతో అభివృద్ధి పనులు

**తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి**

**నెల్లూరు,జులై 17 .అక్షర టైమ్స్ :** నెల్లూరు రూరల్ నియోజకవర్గం పరిధిలో 851 కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. శుక్రవారం గొల్లకందుకూరు గ్రామంలో 36 లక్షల రూపాయలతో నిర్మించిన విలేజ్ హెల్త్ క్లినిక్ ని గుండ్లపాలెం పి.ఏ.సి.ఎస్. సొసైటీ ఛైర్మెన్ పముజుల ప్రదీప్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్లలో గొల్లకందుకూరు గ్రామ అభివృద్ధికి 6 కోట్ల రూపాయలు కేటాయించామనీ తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి పేర్కొన్నారు. ప్రజల సూచనలు, సలహాల మేరకే నెల్లూరు రూరల్ లో అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. గ్రామాలలో ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ఉండే విధంగా రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడు గ్రామాలలో విలేజ్ హెల్త్ క్లినిక్లను ఏర్పాటు చేసి ప్రజలకు ఆరోగ్య భద్రతను కల్పిస్తున్నారనీ ఇంత మంచి చేస్తున్న కూటమి ప్రభుత్వానికి ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడుకి మరియు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డికి



అందరి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలనీ తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి కోరారు. పై కార్యక్రమంలో జడ్పీ కో ఆప్షన్ మెంబర్ అల్లాబక్షు, శ్రీ వేదగిరి లక్ష్మీ నరసింహస్వామి దేవస్థాన చైర్మన్ ఇందుపూరు అచ్యుత్ రెడ్డి, నెల్లూరు రూరల్ మండల ఎమ్మెల్యే కార్యాలయ ఇంచార్జ్ వేమిరెడ్డి సురేంద్ర రెడ్డి, నెల్లూరు రూరల్ మండల ఎమ్మెల్యే కార్యాలయ గ్రీవెన్స్ సెల్ ఇంచార్జ్ భాస్కర్ రెడ్డి, మాజీ సర్పంచ్ దొరసానమ్మ, టీడీపీ నాయకులు శివారెడ్డి,



దయాకర్ రెడ్డి, హరిప్రసాద్ రెడ్డి, సిద్ధరెడ్డి శ్రీనివాసులు రెడ్డి, వినుకోటి వేమయ్య, సురేంద్ర రెడ్డి, రాజేందర్ రెడ్డి, బుజ్జి రెడ్డి, పెంచల నారాయణ, తోడేటి మురళి, చింతగింజల శ్రీనివాసులు, మహేంద్ర, మధు, ఆది శేషయ్య, శ్రీనివాసులు, వేణు, అజయ్, ప్రసన్న లక్ష్మి, శ్రీకాంత్, పెంచలయ్య, వెంకటేశ్వర్లు, అనిల్, సురేష్, కృష్ణయ్య, పెంచలయ్య, వెంకటేశ్వర్లు, పండు, నరేష్, రాము, శ్రీను, సురేష్, రమేష్, కొండయ్య, మస్తానయ్య, తదితరులు పాల్గొన్నారు.

# అంతర్జాతీయ దినోత్సవం పురస్కరించుకొని న్యాయవాదికి సన్మానం

**నెల్లూరు,జులై 17 .అక్షర టైమ్స్ :** అంతర్జాతీయ న్యాయ దినోత్సవం సందర్భంగా న్యాయవాది సామాజికవేత్త ఇర్ల వెంకటరమణయ్య ను ఘనంగా పలువురు సన్మానించారు. శుక్రవారం ప్రముఖ న్యాయవాది, సామాజిక వేత్త ఇర్ల వెంకట రమణయ్య ప్రజలకు అందిస్తున్న సేవలను కొనియాడుతూ, అభిమానులు, ఆత్మీయులు కొండలరావు, ప్రేమ్ కుమార్, లక్ష్మి తదితరులు చేపట్టారు. ఈ సందర్భంగా న్యాయవాది



వెంకటరమణయ్య మీడియాతో మాట్లాడుతూ జిల్లాలోని గౌరవ



న్యాయమూర్తులకు న్యాయవాదులకు ప్రజా ప్రతినిధులకు అధికారులకు న్యాయ దినోత్సవం శుభాకాంక్షలు తెలిపారు. భారతదేశంలో రాజ్యాంగం పౌరులకు కల్పించిన ప్రాథమిక హక్కులుకు భంగం కలిగినప్పుడు ఉన్నత న్యాయస్థానాలు ద్వారా త్వరితగతిన న్యాయం పొందవచ్చు అని తెలిపారు. అదేవిధంగా నిరంతరం ప్రజా సమస్యలపై పోరాడుతూ పరిష్కరించే దిశగా పేదవారికి న్యాయ సహాయం అందించేందుకు తను ఎప్పుడూ సిద్ధంగా ఉంటానని తెలిపారు. అంతర్జాతీయ న్యాయ దినోత్సవం సందర్భంగా న్యాయవాది సామాజికవేత్త ఇర్ల వెంకటరమణయ్య ను ఘనంగా సన్మానించిన ఆత్మీయులు కొండలరావు ప్రేమ్ కుమార్ లక్ష్మి తదితరులు మాట్లాడుతూ తమ లాంటి వారికి న్యాయ సలహాలు ఇస్తూ వెన్నంటి ఉండటం సంతోషంగా ఉందని ఇలాంటి వారిని సత్కరించుకోవడం ఎంతైనా అవసరం అన్నారు.

www.akshratimes.com
తెలుగు దినపత్రిక
అక్షర టైమ్స్
మా అక్షరం ప్రజల పక్షం
గ్రేటర్ హైదరాబాద్, ఈస్ట్ గోదావరి, కాకినాడ జిల్లా, వెస్ట్ గోదావరి, ఏలూరు జిల్లా

# వీర్లంకపల్లి, పెంటపల్లి గ్రామ మహిళలకు కంబాల ఉచితంగా 700 పట్టు చీరల పంపిణీ..

**గోకవరం,జులై 17 .అక్షర టైమ్స్ :** గోకవరం మండలం ఇర్లంకపల్లి, పెంటపల్లి గ్రామాలలో గురువారం రాత్రి నిర్వహించిన కంబాల కానుక వనితల వేడుక కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రకమానికి విశ్వహిందూ ధర్మపరిరక్షణ రామసేన అధ్యక్షులు, బీజేపీ నాయకులు కంబాల శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా పాల్గొని రెండు గ్రామాలకు చెందిన మహిళలకు 700 పట్టు చీరలను ఉచితంగా పంపిణీ చేశారు. తొలిత కంబాల శ్రీనివాసరావు వీర్లంకపల్లి గ్రామస్తులు ఘన స్వాగతం పలికి, పూలమాలలతో సత్కరించారు. గ్రామంలో పలు ఆలయాలను దర్శించుకుని, పూజలు నిర్వహించి, అమ్మవారికి తొలి చీరను అందజేశారు. వీర్లంకపల్లి గ్రామంలో 230 మంది మహిళలకు పట్టు చీరలను ఉచితంగా





పంపిణీ చేసారు. అనంతరం పెంటపల్లి గ్రామాన్ని సందర్శించి, గ్రామంలో ఆలయాలను దర్శించుకున్నారు. పెంటపల్లి గ్రామంలో జరిగిన కార్యక్రమంలో 470 మంది మహిళలకు ఉచితంగా పట్టు చీరలను పంపిణీ చేసారు. ఈ సందర్భంగా కంబాల శ్రీనివాసరావు మాట్లాడుతూ మహిళల సంక్షేమం ఆర్థిక, సామాజిక అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. సమాజంలో మహిళలకు గౌరవప్రదమైన స్థానం కల్పించాలనే ఉద్దేశంతోనే ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. మహిళలకు అండగా నిలుస్తూ భవిష్యత్తులో కూడా ఇటువంటి సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహిస్తామని పేర్కొన్నారు. ప్రజల ఆశీర్వాదం, అభిమానంతో సేవా కార్యక్రమాలను కొనసాగిస్తూ, సమాజ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో రామసేన సభ్యులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఉభయగోదావరి బీఈడీ కళాశాలల యాజమాన్య అధ్యక్షుడిగా డాక్టర్ బి.సువర్ణ కుమార్ ఎన్నిక

**హన్నా కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్‌లో ఘన సత్కారం**



**గోకవరం,జులై 17 .అక్షర టైమ్స్ :** ఆదికవి నన్నయ యూనివర్సిటీ పరిధిలోని ఉభయగోదావరి జిల్లాల బీఈడీ కళాశాలల యాజమాన్యసంఘం అధ్యక్షుడిగా హన్నా కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్ చైర్మన్ డాక్టర్ బి. సువర్ణ కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. విద్యారంగంలో ఆయన అందించిన సేవలు, కళాశాలల అభివృద్ధికి చేస్తున్న కృషిని గుర్తిస్తూ ఈ బాధ్యతలను అప్పగించినట్లు యాజమాన్య ప్రతినిధులు తెలిపారు. ఈ సందర్భంగా గోకవరం హన్నా కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్‌లో కళాశాల సిబ్బంది, అధ్యాపకులు, విద్యార్థులు డాక్టర్ బి. సువర్ణ కుమార్‌ను సాలువా కప్పి, పూలమాలతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఆయన నాయకత్వంలో ఉభయగోదావరి జిల్లాల్లో బీఈడీ విద్య మరింత అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. డాక్టర్ బి. సువర్ణ కుమార్ మాట్లాడుతూ, తనపై ఉంచిన విశ్వాసానికి అందరికీ కృతజ్ఞతలు తెలుపుతూ, బీఈడీ కళాశాలల అభివృద్ధి, విద్యా ప్రమాణాలపెంపు,యాజమాన్యాల సమస్యల పరిష్కారం కోసం సమిష్టిగా కృషి చేస్తానని అన్నారు.ఈ కార్యక్రమంలో వెంకటేశ్వరరావు, ప్రసాద్, తులసి కుమారి, శ్రీను, రాజేష్, రాజు, శివరామకృష్ణ, వై.వి.ఎస్. నారాయణ, దుర్గాప్రసాద్, శ్రీకాంత్ తదితరులు పాల్గొని డాక్టర్ బి. సువర్ణ కుమార్‌కు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.

# ప్రజలకు అందుబాటులోకి యాక్సిస్ బ్యాంక్ సేవలు

**బ్రాంచ్-2 ను ఆవిష్కరించిన కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్**

**శేర్లింగంపల్లి,జులై 17 .అక్షర టైమ్స్ : (ప్రతినిధి ఎం.ఈరన్న)** శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని నల్లగండ్లలో నూతనంగా ఏర్పాటు చేసిన యాక్సిస్ బ్యాంక్ నల్లగండ్ల బ్రాంచ్-2 ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ ముఖ్య అతిథులుగా హాజరై బ్యాంక్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. వేగంగా అభివృద్ధి చెందుతున్న నల్లగండ్ల ప్రాంతంలో ఆక్సిస్ బ్యాంక్ రెండవ బ్రాంచ్ ఏర్పాటు చేయడం స్థానికులకు ఎంతో ఉపయోగకరమని అన్నారు. వినియోగదారులకు నాణ్యమైన బ్యాంకింగ్ సేవలు అందించి ప్రజల ఆర్థిక అవసరాలకు తోడ్పాటునందించాలని బ్యాంక్ సిబ్బందికి కార్పొరేటర్ సూచించారు. ఈ కార్యక్రమంలో యాక్సిస్ బ్యాంక్ సర్కిల్ హెడ్ రవీంద్రనాథ్, క్లస్టర్ హెడ్ మధుసూదన్ గౌడ్, బ్రాంచ్ మేనేజర్ గడిరాజు కపర్తి, పురం విష్ణువర్ధన్ రెడ్డి, రాజ్ కుమార్, రవి యాదవ్, బ్యాంక్ అధికారులు, సిబ్బంది, వినియోగదారులు తదితరులు పాల్గొన్నారు.



# హిందూ స్మశానవాటికను పరిరక్షించాలి

**చర్లపల్లి,జులై 17 .అక్షర టైమ్స్ : (ప్రతినిధి గోపగాని పాండు)** మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా చిన్న చర్లపల్లిలోని హిందూ స్మశానవాటికను ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే ఎన్.వి.ఎస్.ఎస్. ప్రభాకర్ సందర్శించి అక్కడి పరిస్థితులను పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు, కుల సంఘాల ప్రతినిధులు, కాలనీ సంక్షేమ సంఘాల నాయకులతో మాట్లాడి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు.అనంతరం ఆయన మాట్లాడుతూ, చిన్న చర్లపల్లిలోని ఈ స్మశానవాటిక గత వందేళ్లకు పైగా హిందూ సమాజం అంత్యక్రియల కోసం వినియోగంలో ఉందని పేర్కొన్నారు. ఇలాంటి చారిత్రక ప్రాధాన్యం కలిగిన హిందూ స్మశానవాటికలో ఇతర మతాలకు స్థలం కేటాయించే ప్రతిపాదనలు వస్తున్నాయనే సమాచారం ప్రజల్లో తీవ్ర ఆందోళనకు గురిచేస్తోందని అన్నారు. హిందువుల ఆచారాలు, సంప్రదాయాలు, మత విశ్వాసాలను దృష్టిలో ఉంచుకుని ఈ స్మశానవాటికను హిందువులకే పరిమితం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.ఇతర మతాలకు అవసరమైతే ప్రభుత్వం తగిన స్థలాన్ని గుర్తించి ప్రత్యేకంగా కేటాయించాలని సూచించారు. ఇప్పటికే హిందువులు ఎన్నో దశాబ్దాలుగా వినియోగిస్తున్న ఈ స్థల స్వరూపాన్ని మార్చేలా ఎలాంటి చర్యలు చేపట్టరాదని ఆయన స్పష్టం చేశారు. ప్రజల మనోభావాలను గౌరవిస్తూ అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు. ఈ అంశంపై త్వరలోనే జిల్లా కలెక్టర్, రెవెన్యూ డివిజనల్ అధికారిని కలిసి వినతిపత్రం సమర్పించనున్నట్లు ప్రభాకర్ తెలిపారు. అవసరమైతే ప్రజలతో కలిసి ప్రజాస్వామ్య పద్ధతిలో ఉద్యమం చేపట్టేందుకు కూడా వెనుకాడబోమని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో రుద్రగోని రాంచందర్ గౌడ్, కొమ్ము నర్సింగ్, పల్లె వెంకటరెడ్డి, రాంబాబు, కే. బాలరాజ్, లక్ష్మణ్ గౌడ్, టి. బీరప్ప, రాజేష్, డి. బాబి, అబ్బయ్య, ఆనంద్ గౌడ్‌లతో పాటు చిన్న చర్లపల్లి, పరిసర కాలనీలకు చెందిన వివిధ కుల సంఘాల అధ్యక్షులు, కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు, సామాజిక సంస్థల నాయకులు, స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని హిందూ స్మశానవాటికను యథాతథంగా కొనసాగించాలని కోరారు.





## రాష్ట్ర ఎస్సీ కమీషను చైర్మన్ ను కలిసిన గోన చెన్న కేశవులు



**కంభంజులై 17 .అక్షర టైమ్స్ : (ప్రతినిధి మల్లాపురం సాగర్)** గిద్దలూరు నియోజకవర్గ పరిధిలోని కంభం గ్రామంలో కీలక రాజకీయ అధికారిక భేటీ జరిగింది.. ఎస్సీ ఎడ్యుకేషనల్ అండ్ వెల్ఫేర్ స్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి గోనా చెన్నకేశవులు స్వగృహానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ కెయస్ జవహర్ విచ్చేశారు. ఈ సందర్భంగా గోన చెన్నకేశవులు ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి ఆత్మీయ స్వాగతం పలికారు. అనంతరం చైర్మన్ కేఎస్ జవహరును ఘనంగా సత్కరించారు. ఈ ప్రత్యేక కార్యక్రమంలో స్థానిక మండల నాయకులు భారీ సంఖ్యలో పార్టీ కార్యకర్తలు పాల్గొని సందడి చేశారు

## పెన్ పహాడ్ నూతన ఎస్సై బాలు నాయక్‌కు ఘన సన్మానం



**పెన్ పహాడ్జులై 17 .అక్షర టైమ్స్ :** పెన్ పహాడ్ మండల నూతన సబ్ ఇన్స్పెక్టర్ గా బాధ్యతలు చేపట్టిన బాలు నాయక్‌ను శుక్రవారం పలువురు ప్రముఖులు మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో ఎమ్మార్పీఎస్ పెన్ పహాడ్ మండల అధ్యక్షుడు కొండేటి గోపి ఆధ్వర్యంలో నూతన ఎస్సైకి శాలువా కప్పి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు, ప్రజల సమస్యల పరిష్కారానికి నూతన ఎస్సై అంకితభావంతో పనిచేయాలని కోరారు. పోలీస్ శాఖకు, ప్రజలకు మధ్య సన్నిత సంబంధాలు ఉండాలని ఆకాంక్షించారు. ఈ సన్మాన కార్యక్రమంలో దోస పహాడ్ సర్పంచ్ వలపట్ల సైదమ్మ లింగయ్య, అనంతారం మాజీ ఎంపిటిసి మామిడి పరంధాములు, నాయకులు మామిడి ప్రశాంత్, కొండేటి వెంకట్, మావిడి నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## కావలి డి.డి.ఓ బాధ్యతలు చేపట్టిన టీ.నగేష్ కుమారి



**కావలి,జులై 17 .అక్షర టైమ్స్ :** కావలి డివిజనల్ డెవలప్‌మెంట్ మెంట్ అధికారి(డీడీఓ)గా టీ నగేష్ కుమారి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కార్యాలయంలో బాధ్యతలు చేపట్టిన ఆమెకు అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు శుభాకాంక్షలు తెలిపారు. కొత్తగా బాధ్యతలు చేపట్టిన టీ నగేష్ కుమారిని ఎన్జీఓ విజన్ యూత్ తాలూకా అధ్యక్షులు, ఏపీ జేఏసీ చైర్మన్ వెలుగోటి మధు, కార్యాలయ ఉద్యోగులు, సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, ప్రజలకు మెరుగైన పరిపాలనా సేవలు అందించడంలో ఆమె సమర్థవంతంగా పనిచేయాలని ఆకాంక్షించారు. నగేష్ కుమారి మాట్లాడుతూ తమ పరిధిలోని సిబ్బందికి, ప్రజలకు పారదర్శకంగా, బాధ్యతాయుతంగా సేవలు అందించేందుకు కృషి చేస్తానని తెలిపారు.

## షైనింగ్ స్టార్స్ అవార్డుకు నాగార్జున విద్యార్థి ఎంపిక..



**పొదలకూరు,జులై 17 .అక్షర టైమ్స్ : (రిపోర్టర్ ఆనంద్)** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అందజేసే షైనింగ్ స్టార్స్ అవార్డు కు పొదలకూరులోని నాగార్జున ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థి మేకల పూర్ణ చందు ఎంపిక కావడం పాఠశాలకు గర్వకారణంగా నిలిచింది. 2026 పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో 600 మార్కులకు గాను 589 మార్కులు సాధించి విశేష ప్రతిభ కనబరిచిన పూర్ణచందుకు ఈ ప్రతిష్టాత్మక గుర్తింపు లభించింది. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో శుక్రవారం ప్రత్యేక అభినందన సభ నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంట్ ఎం. సుధాకర్ రెడ్డి, ప్రిన్సిపాల్ లక్ష్మీ దుర్గతో పాటు యాజమాన్య సభ్యులు విద్యార్థిని ఘనంగా సన్మానించి అభినందించారు. పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించి, జ్ఞాపికను బహూకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, క్రమశిక్షణతో కూడిన కృషి, ఉపాధ్యాయుల సమర్థమైన మార్గదర్శకత్వం, తల్లిదండ్రుల సహకారం వల్లే విద్యార్థి ఈ స్థాయికి చేరుకున్నాడన్నారు. షైనింగ్ స్టార్స్ అవార్డుకు ఎంపిక కావడం పాఠశాలకే కాకుండా పొదలకూరు ప్రాంతానికి గర్వకారణమని పేర్కొన్నారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించి విద్యార్థులు రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొని పూర్ణచందుకు అభినందనలు తెలియజేశారు.

## "షైనింగ్ స్టార్ అవార్డ్స్"సాధించిన

## ముగ్గురు అమరావతి విద్యార్థులు



**పొదలకూరు,జులై 17 .అక్షర టైమ్స్ : (రిపోర్టర్ ఆనంద్)** పొదలకూరు మండలం లో ప్రకటించిన 6 షైనింగ్ స్టార్ అవార్డుల్లో 3 అవార్డులను అమరావతి విద్యాసంస్థ విద్యార్థులు కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ కే సురేష్ మాట్లాడుతూ ఇది అమరావతి విద్యాసంస్థలో అందిస్తున్న నాణ్యమైన విద్య, క్రమశిక్షణ, ఉపాధ్యాయుల అంకితభావం మరియు విద్యార్థుల నిరంతర శ్రమకు నిదర్శనం అన్నారు. షైనింగ్ స్టార్ అవార్డ్స్ సాధించిన విద్యార్థులు ఎం మణి దీప్ 592/600, ఎన్ సాయి మేఘన 591/600, కే ప్రణదీప్ 589/600 మార్కులు సాధించి ఈ అవార్డులను కైవసం చేసుకున్నారు. అత్యుత్తమ మార్కులతో రాష్ట్ర స్థాయిలో గుర్తింపు పొందిన ఈ ముగ్గురు విద్యార్థులను అమరావతి విద్యాసంస్థ అధినేత హృదయపూర్వకంగా అభినందించారు. వారి తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేస్తూ, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. విజయం మా లక్ష్యం కాదు... విద్యార్థుల భవిష్యత్తే మా లక్ష్యం అనే నినాదంతో ముందుకు సాగుతున్న అమరావతి విద్యాసంస్థ అని పేర్కొన్నారు. ప్రతి విద్యార్థిలోని ప్రతిభను వెలికితీసి రాష్ట్ర, జాతీయ స్థాయిలో నిలబెట్టేందుకు నిరంతరం కృషి చేస్తోందన్నారు. ఈ అపూర్వ విజయానికి సహకరించిన తల్లిదండ్రులకు, ఉపాధ్యాయ బృందానికి, శ్రేయోభిలాషులకు అమరావతి విద్యాసంస్థ యాజమాన్యం హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.

## చేనేతలకు 'నేతన్న భరోసా' పథకం సక్రమంగా అమలు చేయాలి



**పొదలకూరు,జులై 17 .అక్షర టైమ్స్ : (రిపోర్టర్ ఆనంద్)** చేనేత కార్మికులకు ప్రభుత్వం ప్రకటించిన 'నేతన్న భరోసా' పథకాన్ని అర్హులైన ప్రతి చేనేత కుటుంబానికి సక్రమంగా అమలు చేయాలని వైఎస్సార్సీపీ చేనేత విభాగం రాష్ట్ర కార్యదర్శి కోసం బ్రహ్మయ్య, సర్వేపల్లి నియోజకవర్గ చేనేత విభాగం అధ్యక్షుడు పముజుల శంకరయ్య డిమాండ్ చేశారు. వారు మాట్లాడుతూ, ఆగస్టు 7న చేనేత కార్మికులకు రూ. 25 వేల చొప్పున ఆర్థిక సాయం అందజేయనున్నట్లు పత్రికా కథనాల ద్వారా తెలిసిందని తెలిపారు. జౌళి శాఖ నిర్వహించిన కసరత్తులో రాష్ట్రవ్యాప్తంగా సుమారు 54 వేల మంది మాత్రమే అర్హులుగా గుర్తించినట్లు ప్రచారం జరుగుతోందని, అయితే ఈ అంచనా వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా లేదని పేర్కొన్నారు. 2019 నుంచి 2024 వరకు వైఎస్సార్సీపీ ప్రభుత్వ హయాంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అమలు చేసిన 'నేతన్న నేస్తం' పథకం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా సుమారు 81,700 మంది సొంత మగ్గం కలిగిన చేనేత కార్మికులు లబ్ధి పొందారని తెలిపారు. నెల్లూరు జిల్లాలోనే దాదాపు 3,500 మంది చేనేత కార్మికులకు ఈ పథకం వర్తించిందని గుర్తుచేశారు. ప్రస్తుతం జిల్లాలో సుమారు 2,900 మందికి మాత్రమే నేతన్న భరోసా అమలు చేస్తారనే ప్రచారం ఆందోళన కలిగిస్తోందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తై మూడో సంవత్సరం ప్రారంభమైన నేపథ్యంలో, గత రెండేళ్లకు సంబంధించిన నేతన్న భరోసా బకాయిగా ఉన్న రూ. 50 వేల ఆర్థిక సాయాన్ని కూడా వెంటనే విడుదల చేయాలని వారు కోరారు. అదేవిధంగా, 50 సంవత్సరాలు నిండిన ప్రతి చేనేత కార్మికుడికి ప్రత్యేక పెన్షన్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. వైఎస్సార్సీపీ ప్రభుత్వంలో చేనేతలకు నాలుగు కార్పొరేషన్లు ఏర్పాటు చేశారని, ప్రస్తుతం రెండు కార్పొరేషన్లు మాత్రమే కొనసాగిస్తూ దేవాంగ, తొగట వర్గాలకు కార్పొరేషన్లు ఇవ్వకుండా అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. ఆ కార్పొరేషన్లను వెంటనే ఏర్పాటు చేయాలని కోరారు. ప్రతి చేనేత కార్మికుడు, సొంత మగ్గంపై నేత నేసేవారు, సహకార సంఘాల్లో పనిచేసే నేత కార్మికులు, చేనేత అనుబంధ ఉపవృత్తులపై ఆధారపడే వారందరికీ 'నేతన్న భరోసా' పథకాన్ని ఎలాంటి వివక్ష లేకుండా అమలు చేయాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## సీ.జీ.హెచ్.ఎస్ సీనియర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కొండా నాగార్జున కు చీఫ్ మెడికల్ మెడికల్ ఆఫీసర్ గా పదోన్నతి

**గుంటూరు,జులై 17 .అక్షర టైమ్స్ :** ఐదు జిల్లాల పరిధి వరకు విస్తరించి ఉన్న గుంటూరు సీ.జీ.హెచ్.ఎస్ (సెంట్రల్ గవర్నమెంట్ హెల్త్ స్కీం) వెల్ నెస్ కార్యాలయంలో సీనియర్ మెడికల్ ఆఫీసర్ గా సేవలందిస్తున్న డాక్టర్ కొండా నాగార్జున చీఫ్ మెడికల్ ఆఫీసర్ (సీ.ఎం.ఓ) గా పదోన్నతి పొందారు. ఆయనను గుంటూరు కే కేటాయిస్తూ శుక్రవారం కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. శనివారం అధికారకంగా సీ.ఎం.ఓ గా ఆయన బాధ్యతలు స్వీకరిస్తారు. నాలుగు రోజుల క్రితం నెల్లూరు సీ.జీ.హెచ్.ఎస్ నుండి బదిలీ పై వచ్చిన దాసరి రమేష్ సీ.ఎం.ఓ గా ప్రస్తుతం గుంటూరులో విధులు నిర్వహిస్తున్నారు. కొండా నాగార్జునకు కూడా పదోన్నతి లభించడంతో సీ.జీ.హెచ్.ఎస్ కేంద్రాలలో ఎక్కడా లేని విధంగా గుంటూరులో ఇద్దరు సీ.ఎం.ఓ లు విధులు నిర్వహించడం విశేషం. పదోన్నతి పొందిన కొండా నాగార్జున ను గుంటూరు సీ.జీ.హెచ్.ఎస్ లోకల్ ఎడ్వైజరీ కమిటీ మెంబర్లు గుమ్మడి సీతారామయ్యచౌదరి, కట్టా వెంకటేశ్వర్లు,



పలువురు ఉద్యోగులు, పెన్షనర్లు, వైద్య సిబ్బంది పుష్పగుచ్చాలు ఇచ్చి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా నాగార్జున మాట్లాడుతూ.. గుంటూరు సీ.జీ.హెచ్.ఎస్ పరిధిలోని గుంటూరు, పల్నాడు, బాపట్ల, ప్రకాశం, మార్కాపురం జిల్లాలలోని వివిధ కేంద్ర ప్రభుత్వ శాఖలకు చెందిన ఉద్యోగులు, పెన్షనర్లకు వైద్య పరంగా ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూస్తామని హామీ ఇచ్చారు. నగదు రహిత ఎంపానల్డ్ ఆసుపత్రులపై వస్తున్న ఫిర్యాదులను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతామన్నారు. గుంటూరు సీ.జీ.హెచ్.ఎస్ వెల్నెస్ సెంటర్ కు వస్తున్న పేషంట్ల తాకిడికి మరో డాక్టర్ అవసరమని కోరుతూ ఎల్.ఎ.సి మెంబర్లు సీతారామయ్యచౌదరి, కట్టా వెంకటేశ్వర్లు సీ.ఎం.ఓ కు, సీ.జీ.హెచ్.ఎస్ డైరెక్టర్ కార్యాలయం కు మెమోరాండం సమర్పించారు.

## అయోధ్య రామాలయంలో 10 రోజుల ప్రాయశ్చిత్త, శుద్ధి పూజలు- సోమవారం సుప్రీంకు సిట్ రిపోర్ట్?!

**రామాలయంలో విరాళాల దుర్వినియోగం వివాదం తర్వాత**

**ప్రాయశ్చిత్త పూజలు ప్రారంభించిన ట్రస్ట్ పారాయణాలు**

**నిర్వహిస్తూ భగవంతుడికి క్షమాపణలు సుప్రీం కోర్టుకు**

**మధ్యంతర రిపోర్ట్ సోమవారం రోజు సమర్పించనున్న సిట్**

ఐఅయోధ్య రామాలయంలో విరాళాల దుర్వినియోగం ఆరోపణలు దేశవ్యాప్తంగా తీవ్ర చర్చకు దారితీసిన నేపథ్యంలో శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ ప్రత్యేక 10 రోజుల ప్రాయశ్చిత్త, శుద్ధి పూజల్ని ప్రారంభించింది. ఆలయంలో జరిగిన విరాళాల దుర్వినియోగంతో కోట్లాది మంది భక్తుల విశ్వాసం దెబ్బతిన్నందున, భగవంతుడికి క్షమాపణలు కోరుతూ ఆలయ పవిత్రతను, గౌరవాన్ని పునరుద్ధరించడమే ఈ పూజల ఉద్దేశమని ట్రస్ట్ తెలిపింది. ఇదే సమయంలో ఈ కేసును దర్యాప్తు చేస్తున్న ప్రత్యేక దర్యాప్తు బృందం సోమవారం సుప్రీం కోర్టుకు మధ్యంతర నివేదికను సమర్పించనుంది. ట్రస్ట్ కోశాధికారి గోవింద్ దేవ్ గిరి సంకల్పంతో బుధవారం ఈ శుద్ధి క్రతువు ప్రారంభమైంది. ఇందులో భాగంగా అయోధ్యలోని గురుకులాల విద్యార్థులు రోజూ విష్ణు సహస్రనామ స్తోత్రాన్ని కనీసం 251 సార్లు పారాయణం చేస్తున్నారు. హిందూ విశ్వాసాల ప్రకారం సమాజంలో సానుకూలతల్ని పెంచి అష్టైశ్వర్యాలను ఇచ్చే శ్రీ మహా విష్ణువు సహస్రనామాలతో (1000 నామాల జపం) పాటు వాల్మీకీ రామాయణ పారాయణాన్ని కూడా ఇక్కడ నిర్వహిస్తున్నారు. 'విరాళాల దుర్వినియోగం కారణంగా ఆలయ పవిత్రత, గౌరవం దెబ్బతిన్నాయి. వాటిని పునరుద్ధరించేందుకే ఈ ప్రత్యేక ప్రాయశ్చిత్త, శుద్ధి కార్యక్రమాన్ని ప్రారంభించాం.' అని గోవింద్ దేవ్ గిరి తెలిపారు. విరాళాల వ్యవహారం భక్తుల్ని తీవ్రంగా బాధించిందని, నిజాలు త్వరలోనే వెలుగులోకి వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. రామ్‌లల్లా ఆలయంలో జరిగిన తప్పులకు ప్రాయశ్చిత్తంగా ఈ పారాయణాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు ట్రస్ట్ సభ్యుడు దినేంద్ర దాస్.

**సుప్రీం కోర్టుకు సోమవారం మధ్యంతర రిపోర్ట్ సమర్పించనున్న సిట్**

ఇక సిట్‌ను ఇటీవల స్టేటస్ రిపోర్ట్ సమర్పించాలని సుప్రీం కోర్టు ఆదేశించగా సోమవారం మధ్యంతర నివేదికను సమర్పించే అవకాశం ఉందని తెలుస్తోంది. ముగ్గురు సభ్యులతో కూడిన సిట్‌లో లఖ్‌నవూ డివిజనల్ కమిషనర్ విజయ్ విశ్వాస్ పంత్, ఐజీ కిరణ్



ఎస్, ఆర్థిక శాఖ ప్రత్యేక కార్యదర్శి నీల్ రతన్ సభ్యులుగా ఉన్నారు. ఇక ఫైనల్ రిపోర్టులో ఆలయ పరిపాలన, విరాళాల లెక్కింపు వ్యవస్థలో సంస్కరణలపై కీలక సిఫార్సులు చేసే అవకాశం ఉంది. జులై 22న అయోధ్యలో జరగనున్న ట్రస్ట్ సమావేశంలో వాటిపై చర్చించనున్నారు.

**8 మంది అరెస్ట్- ఇద్దరు ట్రస్ట్ సభ్యుల రాజీనామా**

ఈ విరాళాల దుర్వినియోగం వివాదం జూన్ 7న వెలుగులోకి వచ్చింది. అనంతరం జూన్ 13న ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం విచారణ కోసం ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేసింది. సిట్ ప్రాథమిక నివేదిక ప్రకారం విరాళాల లెక్కింపులో పాల్గొన్న 8 మందిని అరెస్ట్ చేశారు. ఆలయ విరాళాల నుంచి మళ్లించినట్లుగా భావిస్తున్న నగదును స్వాధీనం చేసుకున్నారు. ట్రస్ట్ మాజీ ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్, ట్రస్టీ అనిల్ మిశ్రా రాజీనామా చేశారు.

**మరో ఇద్దరు నిందితులకు పోలీస్ కస్టడీ**

విరాళాల చోరీ దర్యాప్తులో శుక్రవారం మరో కీలక పరిణామం చోటు చేసుకుంది. కేసు నిందితులుగా ఉన్న రామ్ శంకర్ యాదవ్ అలియాస్ తిన్నూ యాదవ్, మనీష్ యాదవ్‌లకు అయోధ్య కోర్టు 39 గంటల పోలీస్ కస్టడీ మంజూరు చేసింది. ఈ కేసు వెనుక పూర్తి కుట్రను బయటపెట్టేందుకు ఈ ఇద్దరినీ విచారించడం అత్యంత అవసరమని పోలీసులు కోర్టుకు తెలిపారు. విరాళాల రూపంలో వచ్చిన డబ్బును ఎక్కడికి తరలించారు?, ఎవరెవరి చేతులు మారింది? అనే వివరాలు రాబట్టేందుకు, ఇంకా కీలక సాక్ష్యాల్ని సేకరించేందుకు కస్టడీకి ఇవ్వాలని కోరారు. అయితే 7 రోజుల కస్టడీ కోరుతూ పిటిషన్ దాఖలు చేయగా, వాదనలు విన్న కోర్టు 39 గంటల కస్టడీకే అనుమతి ఇచ్చింది. కోర్టు ఉత్తర్వుల ప్రకారం శనివారం ఉదయం వీరిద్దరినీ జైలు నుంచి బయటికి తీసుకొచ్చి పోలీసులు విచారించనున్నారు. అంతకుముందు బుధవారం మరో ఇద్దరు నిందితులు సుభాష్ చంద్ర శ్రీవాస్తవ, రామశంకర్ మిశ్రాలకు కోర్టు 14 గంటల పోలీస్ కస్టడీ మంజూరు చేసింది. దీంతో వీరిని ప్రశ్నించి పోలీసులు కీలక వివరాలు సేకరించారు. దానికి ముందు నలుగురు నిందితులు అవినాష్ శుక్లా, అనుకల్ప్ మిశ్రా, లవ్‌కుష్ మిశ్రా, కరుణేష్ పాండేలను పోలీసు కస్టడీలో విచారించారు.

**ప్రధాని మౌనం వీడాలని కాంగ్రెస్ డిమాండ్**

ఈ వివాదంపై కాంగ్రెస్ పార్టీ కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేస్తోంది. ట్రస్ట్ ఏర్పాటును గతంలో ప్రధాని నరేంద్ర మోదీనే ప్రకటించారని, ఇప్పుడు అదే ట్రస్టులో చందా చోరీ ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో పార్లమెంటులోనే ప్రధాని ఈ అంశంపై సమాధానం ఇవ్వాల్సిన అవసరం ఉందని డిమాండ్ చేశారు పార్టీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్. '2020 ఫిబ్రవరి 5న స్వయంగా ప్రధాని నరేంద్ర మోదీనే శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టు ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. ఇప్పుడు అదే ట్రస్టులో 'చందా చోరీ– ఆస్తా ధోఖా' జరిగిందని ఆరోపణలు వస్తున్నాయి. అందుకే ప్రధాని పార్లమెంటులో ఈ అంశంపై మౌనం వీడి వివరణ ఇవ్వాలి.' అని పేర్కొన్నారు. మరోవైపు ట్రస్ట్ నిర్వహిస్తున్న ప్రాయశ్చిత్త యజ్ఞమే అయోధ్యలో తీవ్రమైన తప్పిదం జరిగిందనే విషయాన్ని నిరూపిస్తుందన్నారు యూపీ కాంగ్రెస్ అధ్యక్షుడు అజయ్ రాయ్. ఇక విరాళ దుర్వినియోగానికి బాధ్యులైన వ్యక్తులు స్వయంగా ప్రాయశ్చిత్తంలో పాల్గొని క్షమాపణ కోరితేనే యజ్ఞానికి విలువ ఉంటుందని, లేకపోతే కంటితుడుపు చర్యే అవుతుందని సమాజ్‌వాదీ పార్టీ నేత అభిషేక్ మిశ్రా వ్యాఖ్యానించారు.

## ఆ బిల్లుల ఆమోదమే ప్రభుత్వ ప్రాధాన్యం- పార్లమెంట్ సమావేశాలపై చీణాూ వ్యూహరచన

**దిల్లీలోని కర్తవ్యభవన్‌లో సమావేశమైన ఎన్?డీఏ కూటమి- రానున్న వర్షకాల సమావేశంలో ప్రభుత్వ విధివిధానాలపై సాగిన చర్చలు- ప్రవేశపెట్టబోయే బిల్లులపై కసరత్తు చేస్తున్న కూటమి- డీలిమిటేషన్‌పై అధ్యయనం చేసి నిర్ణయం తీసుకుంటామన్న డీఎంకే**

పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ప్రారంభం కానున్న వేళ ఎన్?డీఏ ప్రభుత్వం వ్యూహరచనను వేగవంతం చేసింది. ఈ క్రమంలో దిల్లీలోని కర్తవ్య భవన్‌లో రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన మంత్రుల బృందం కీలక సమావేశం నిర్వహించింది. జులై 20న జరగనున్న పార్లమెంట్ వార్షాకాల సమావేశాల్లో ప్రభుత్వం చేపట్టాల్సిన విధివిధానాలు, రెండు ఆర్డినెన్స్‌లను చట్టాలుగా మార్చడంపై ఎన్?డీఏ కూటమి చర్చించింది. ముఖ్యంగా ఆదాయపు పన్నుసవరణ బిల్లు, గతంలో నెగ్గని డీలిమిటేషన్‌తో కూడిన మహిళా రిజర్వేషన్ బిల్లులను మళ్లీ పార్లమెంట్ ముందుకు తెచ్చేందుకు ఎన్?డీఏ కసరత్తు చేస్తోంది. మరోవైపు ప్రభుత్వంపై విమర్శలు గుప్పించేందుకు ప్రతిపక్షాలు సిద్ధమవుతున్నాయి. ముఖ్యంగా నీట్ పేపర్ లీకేజీ, పశ్చిమాసియా ఘర్షణల్లో భారతీయ నావికుల మృతి, అయోధ్య రామాలయ విరాళాల్లో అవకతవకల ఆరోపణలపై ప్రభుత్వాన్ని నిలదీయాలని ప్రతిపక్షాలు భావిస్తున్నాయి.

**ఎన్?డీఏ పార్లమెంటరీ పార్టీ సమావేశానికి 'మంగళ్ మిలన్' పేరు**

జులై 21న జరగనున్న పార్లమెంటరీ పార్టీ సమావేశానికి 'మంగళ్ మిలన్' అని ఎన్?డీఏ పేరు పెట్టింది. పార్లమెంట్ లైబ్రరీ భవనంలోని జీఎంసీ బాలయోగి ఆడిటోరియంలో ఉదయం 9:30 గంటలకు జరగనున్న ఈ సమావేశానికి లోక్‌సభ, రాజ్యసభలకు చెందిన ఎన్?డీఏ ఎంపీలందరూ హాజరుకానున్నారు. ప్రభుత్వ శాసనపరమైన అజెండా నేపథ్యంలో ఎన్?డీఏ నాయకుల ఈ సమావేశం ప్రాముఖ్యాన్ని సంతరించుకుంది. కేంద్ర పార్లమెంటరీ



వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు గతంలో ప్రకటించినట్లుగా, ఆగస్టు 13 వరకు కొనసాగే వర్షాకాల సమావేశాల్లో పలు ముఖ్యమైన బిల్లులను చేపట్టే అవకాశం ఉంది. ఇదిలా ఉండగా, డీలిమిటేషన్? బిల్లుపై డీఎంకే ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. లోక్‌సభ, రాష్ట్రాల అసెంబ్లీల పునర్విభజనపై కేంద్రం బిల్లు పెడితే అధ్యయనం చేసి, తమిళనాడు ప్రయోజనాల మేరకు నిర్ణయం తీసుకుంటామని తెలిపింది. బిల్లు పరిధి, లక్ష్యాలు తెలిసిన తర్వాత విశ్లేషించి నిర్ణయం తీసుకుంటామని డీఎంకే వర్గాలు తెలిపాయి. తమిళనాడు ప్రయోజనాలు కాపాడేందుకు డీఎంకే తీసుకునే నిర్ణయం స్వతంత్రంగా ఉంటుందని ఆ పార్టీ వర్గాలు వివరించాయి. డీలిమిటేషన్‌పై వర్షాకాల సమావేశాల్లో పెట్టే బిల్లు స్వతంత్ర చట్టంగానే ఉండే అవకాశం ఉందని, ఇతర చట్టాలతో కలిపి ఉండదని భావిస్తున్నట్లు తెలిపాయి. 50 శాతం సీట్ల పెంపు, రాష్ట్రాల మధ్య ప్రస్తుతం ఉన్న సీట్ల పంపిణీ నిష్పత్తిని అలాగే కొనసాగించడం తదితర వంటి అంశాలు చర్చలో ఉన్నాయని పేర్కొన్నాయి. జులై 16న జరిగిన పార్టీ ఎంపీల సమావేశంలో డీలిమిటేషన్‌పై చర్చ జరిగింది. లండన్‌లో ఉన్న డీఎంకే అధ్యక్షుడు ఎంకే స్టాలిన్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఈ సమావేశంలో పాల్గొన్నారు. హస్తం పార్టీతో పొత్తులేనందున బిల్లు విషయంలో కాంగ్రెస్ పార్టీని సంప్రదించకుండా స్వతంత్రంగానే నిర్ణయం తీసుకుంటామని డీఎంకే వర్గాలు వివరించాయి.

**డీఎంకే, ఇండి కూటమిపై జైరాం రమేశ్? కీలక వ్యాఖ్యలు**

మరోవైపు, డీఎంకే, ఇండి కూటమికి సంబంధించిన అంశంపై కాంగ్రెస్ ఎంపీ జైరాం రమేశ్? మాట్లాడారు. "బీజేపీ, డీఎంకేల సిద్ధాంతాలు వేర్వేరు కాబట్టి అవి ఎప్పటికీ కలిసి పనిచేయలేవు. 8వ తేదీన జరిగిన ఇండి కూటమి సమావేశానికి డీఎంకే హాజరుకాలేదన్నది, అలాగే మేము టీవీకేకి మద్దతు ఇస్తున్నామన్నది వాస్తవమే. ప్రభుత్వంలో మాకు ఇద్దరు కేబినెట్ మంత్రులు కూడా ఉన్నారు. మేం డీఎంకే ఎంపీలతో సంప్రదింపులు జరుపుతూనే ఉన్నాం, చర్చలు కొనసాగుతున్నాయి. డీఎంకే ఇప్పటికీ ప్రతిపక్ష పార్టీయే తప్ప, అధికార పక్షం లేదా ఎన్?డీఏలో భాగం కాదు. స్టాలిన్ చేసిన ప్రకటనలను నేను చదివాను, బీజేపీ, డీఎంకేల మధ్య ఎలాంటి ఒప్పందం లేదని స్పష్టమవుతోంది. సరైన సమయం వచ్చినప్పుడు డీఎంకే కచ్చితంగా నియోజకవర్గాల పునర్విభజన బిల్లుకు వ్యతిరేకంగా నిలబడుతుందని నాకు నమ్మకం ఉంది" అని జైరాం రమేశ్? వ్యాఖ్యానించారు.

# భర్త వేధింపులతో ఘోరం.. పిల్లలతో కలిసి బావిలోకి దూకిన తల్లి.. కొమ్మ పట్టుకుని బతికిన కొడుకు

**భర్త వేధింపులతో విసిగిపోయి, ఇద్దరు పిల్లలతో తల్లి ఆత్మహత్యాయత్నం**

**ఈ ఘటనలో తల్లి, కుమార్తె మృతి చెందగా.. కుమారుడు సురక్షితం**

**వ్యవసాయ బావిలోని చెట్టు కొమ్మ పట్టుకుని ప్రాణాలు నిలబెట్టుకున్న బాలుడు**

**కొడుకు అరుపులు విని బావిలో దూకి రక్షించిన తండ్రి**

**వికారాబాద్ జిల్లా శంకర్‌పల్లి మండలంలో ఈ విషాద ఘటన**



నిత్యం తాగి వచ్చి వేధించే భర్తతో విసిగిపోయిన ఓ తల్లి, తన ఇద్దరు పిల్లలతో కలిసి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన వికారాబాద్ జిల్లాలో తీవ్ర విషాదాన్ని నింపింది. ఈ దారుణ సంఘటనలో తల్లి, కుమార్తె ప్రాణాలు కోల్పోగా, కుమారుడు అదృష్టవశాత్తు ప్రాణాలతో బయటపడ్డాడు. వ్యవసాయ బావిలో సుమారు అరగంట పాటు ఓ చెట్టు కొమ్మను పట్టుకుని వేలాడుతూ ప్రాణాలను నిలబెట్టుకున్నాడు. వివరాల్లోకి వెళితే.. వికారాబాద్ జిల్లా యలాల్ మండలానికి చెందిన ఊరుబాటి సుధాకర్, తన భార్య వసంత (35), కుమార్తె నవ్య (15), కుమారుడు వేణు(10)తో కలిసి బతుకుదెరువు కోసం పదేళ్ల క్రితం శంకర్‌పల్లి మండలం కొత్తపల్లి గ్రామానికి వలస వచ్చారు. అక్కడ ఓ తోటలో పనిచేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. అయితే, సుధాకర్‌కు మద్యపానం అలవాటు ఉంది. ప్రతిరోజూ మద్యం మత్తులో ఇంటికి వచ్చి భార్య వసంతతో గొడవపడి, ఆమెను శారీరకంగా, మానసికంగా తీవ్రంగా వేధించేవాడు. నిన్న రాత్రి కూడా సుధాకర్ మద్యం మత్తులో భార్యతో గొడవపడ్డాడు. భర్త వేధింపులను ఇక భరించలేనని భావించిన వసంత, జీవితంపై పూర్తి విరక్తి చెందింది. తాను చనిపోతే పిల్లలు అనాథలవుతారనే ఆవేదనతో వారిని కూడా తనతోపాటే తీసుకెళ్లాలని నిర్ణయించుకుంది. అనుకున్నదే తడవుగా, అర్ధరాత్రి సమయంలో నిద్రిస్తున్న కుమార్తె నవ్య, కుమారుడు వేణును తీసుకుని సమీపంలోని వ్యవసాయ బావి వద్దకు వెళ్లింది. ముగ్గురూ ఒక్కసారిగా బావిలోకి దూకేశారు. అయితే, నీటిలో పడుతున్న సమయంలో బాలుడు వేణుకు బావిలోపలికి వంగి ఉన్న ఒక చెట్టు కొమ్మ చేతికి తగిలింది. ఎలాగైనా బతకాలనే ఆశతో ఆ బాలుడు ఆ కొమ్మను గట్టిగా పట్టుకుని, సుమారు అరగంట పాటు ప్రాణభయంతో వేలాడుతూ ఉండిపోయాడు. మరోవైపు ఇంట్లో భార్యాపిల్లలు కనిపించకపోవడంతో ఆందోళన చెందిన సుధాకర్, చుట్టుపక్కల వెతకడం ప్రారంభించాడు. వ్యవసాయ బావి వద్దకు రాగానే లోపలి నుంచి కొడుకు అరుపులు వినిపించాయి. వెంటనే బావిలోకి చూడగా, కొడుకు కొమ్మ పట్టుకుని ప్రాణాలతో కొట్టుమిట్టాడడం చూసి, తక్షణమే బావిలోకి దూకి అతడిని బయటకు తీసి రక్షించాడు. కానీ, అప్పటికే వసంత, నవ్య నీటిలో మునిగిపోయి ఊపిరాడక మరణించారు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న శంకర్‌పల్లి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. స్థానికుల సహాయంతో తల్లి, కుమార్తె మృతదేహాలను వెలికితీశారు. అనంతరం కేసు నమోదు చేసి, మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం చేవెళ్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# మంత్రి వాకిటి శ్రీహరికి అస్వస్థత.. కేర్ ఆసుపత్రిలో చికిత్స

**తీవ్ర జ్వరం, ఇన్ఫెక్షన్‌తో బాధపడుతున్న వాకిటి శ్రీహరి**

**రెస్ట్ తీసుకుంటే సరిపోతుందన్న వైద్యులు**

**శ్రీహరి ఆరోగ్యం గురించి వాకబు చేసిన రేవంత్ రెడ్డి**



తెలంగాణ రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరి అస్వస్థతకు గురయ్యారు. ఆయనను కుటుంబ సభ్యులు హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని కేర్ ఆసుపత్రికి తరలించారు. తీవ్ర జ్వరం, ఇన్ఫెక్షన్‌తో బాధపడుతున్న మంత్రికి వైద్యులు చికిత్స అందిస్తున్నారు. గత రెండు రోజులుగా ఆయన ఆరోగ్యం సరిగా లేదని కుటుంబ సభ్యులు వెల్లడించారు. ప్రస్తుతం మంత్రి వాకిటి శ్రీహరి ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. మరో రెండు రోజుల రెస్ట్ తీసుకుంటే సరిపోతుందని స్పష్టం చేశారు. మంత్రి త్వరగా కోలుకోవాలని అభిమానులు, పార్టీ నాయకులు ఆకాంక్షిస్తున్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి, ఇతర మంత్రులు, పార్టీ నాయకులు మంత్రి వాకిటి ఆరోగ్యం గురించి ఆరా తీశారు. వాకిటి శ్రీహరి త్వరగా పూర్తి కోలుకుని ప్రజా సేవలో కొనసాగాలని పార్టీ శ్రేణులు ఆకాంక్షిస్తున్నాయి.

# కరీంనగర్ నగల దుకాణం దోపిడీ కేసు

**ఇప్పుడు ట్రైనీ డీఎస్పీలకు ఇదో ప్రత్యేక క్లాసు**

**ప్రత్యేకంగా నిలువున్నున్న పీఎంజే నగల దుకాణం కేసు**

**ఛేదన వ్యూహంపై ట్రైనీ పోలీసులకు బోధన**

**హైదరాబాద్ పోలీస్ అకాడమీలో ప్రత్యేక తరగతి**

**18న వివరించనున్న కరీంనగర్ సీపీ గౌష్ ఆలం**

**కరీంనగర్ పీఎమ్‌జే దోపిడీ కేసు ఛేదన**




తమ ఆనవాళ్లు ఏ మచ్చుకు దొరక్కుండా, సినీ ఫక్కీని తలపిస్తూ చేసిన కరీంనగర్ పీఎంజే నగల దుకాణంలోని దోపిడీ ప్రత్యేకంగా నిలువనుంది. పశ్చిమ బెంగాల్‌లో చిక్కిన ఈ బిహార్ ముఠా తమ డిజిటల్ ఆధారాలు దొరక్కుండా మాస్టర్ ప్లాన్ వేసింది. అయినా ఎంతో వేగంగా ఈ కేసును కరీంనగర్ పోలీసులు ఛేదించి చిత్తు చేశారు. దోపిడీ జరిగిన తీరుపై అద్భుతమైన దర్యాప్తు వ్యూహం నిదర్శనంగా నిలిచింది. ట్రైనీ పోలీసులకు ఈ తరహా కేస్ స్టడీలకు ఉదాహరణగా ఈ కేసు ఛేదన గురించి వివరించనున్నారు. రాష్ట్ర హోంశాఖ మార్గదర్శకాల ప్రకారం పీఎంజే నగల దుకాణం కేసు విచారణ ప్రక్రియను తెలంగాణ పోలీస్ అకాడమీలో కొత్తగా ఎంపికైన డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (డీఎస్పీ)ల ట్రైనింగ్‌లో కేస్‌స్టడీగా వివరించనున్నారు. ఈ మేరకు పోలీస్ అకాడమీలో ఈ నెల 18న శిక్షణ పొందుతున్న డీఎస్పీలకు స్పెషల్ క్లాస్ నిర్వహించనున్నారు. ఈ దోపిడీ కేసును ఛేదించిన కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం స్వయంగా ట్రైనీలకు వివరించనున్నారు. నేరగాళ్లు ప్లాన్ వేసిన తీరు, డిజిటల్ నెట్‌వర్క్‌ను వారు ఎలా నిర్వీర్యం చేశారనే అంశాల గురించి ఆయన చెప్పనున్నారు. దోపిడీకి పాల్పడిన ముఠాలోని నిందితులు వారి మొబైళ్లను సిగ్నల్స్‌కు దొరక్కుండా ఉండేందుకు నిర్మానుష్య ప్రదేశాల్లో పారేసి జాగ్రత్త పడ్డారు. దీని ద్వారా నేరగాళ్లను ట్రేస్ చేయడానికి కేవలం లొకేషన్ డేటాను మాత్రమే నమ్ముకోకుండా సీసీటీవీ నెట్‌వర్క్‌ను నిశితంగా పరిశీలిస్తూ, హ్యూమన్ ఇంటలిజెన్స్ ద్వారా నిందితుల రూట్ మ్యాపింగ్ చేసే ప్రక్రియ గురించి ఈ కేసు నేర్పిస్తుంది. దోపిడీ చేసేందుకు రెండు నెలల ముందు నుంచే కరీంనగర్ పరిసర ప్రాంతాల్లో ముఠాలో కీలక నిందితుడైన సుబోధ్‌సింగ్, తన అనుచరులు మెకానిక్‌లుగా చలామణి అవుతూ రెక్కీ నిర్వహించారు. దీంతో స్థానిక నగల దుకాణాలు, బ్యాంకుల పరిసర ప్రాంతాల్లో అనుమానాస్పదంగా సంచరించే కొత్త వ్యక్తులపై నిరంతరం నిఘా పెట్టడం ఎంత ముఖ్యమైన కర్తవ్యమో ఈ కేసు తెలియజేసింది. నిందితులు స్థానిక లాడ్జీల్లో బస చేసేందుకు నకీల ఆధార్ కార్డులను వినియోగించారు. దీంతో ప్రైవేట్ హాస్టళ్లలో తనిఖీలను కఠినతరం చేయడం, టీఎస్ కాప్ లాంటి యాప్స్ ద్వారా వినియోగదారుల గుర్తింపు కార్డులను లైవ్‌లో వెరిఫై చేయడం ఎంత అవసరమో వివరిస్తుంది. అలాగే నిందితులు దొంగిలించిన సొమ్ముతో పారిపోవడానికి ద్విచక్ర వాహనాలను స్థానికంగానే కొనుగోలు చేశారు. వాటికి తప్పుడు నంబరు ప్లేట్లు తగిలించారు. దీని వల్ల కేవలం నంబర్ ప్లేట్‌పైనే ఆధారపడకుండా నిందితుల వస్త్రధారణ, హెల్మెట్ మోడళ్లను జిల్లాల సరిహద్దులోని సీసీ కెమెరా విజువల్స్ ద్వారా కనెక్ట్ చేసే సాంకేతిక పాఠం ఈ కేసులో ఉంది. ఈ ముఠా బిహార్‌లో ప్లాన్ వేసి, తెలంగాణలో దోచుకొని, పశ్చిమబెంగాల్‌లో పట్టుబడింది. దోపిడీ లేదా నేరం చేసి ఫేక్ ఆధారాలతో ఇతర రాష్ట్రాలను దాటుకుంటూ వెళ్లినప్పుడు రాష్ట్రంలోని పోలీసుల సమన్వయంతో వ్యవహరించడం గురించి చెబుతుంది. ముఖ్యంగా వేరే రాష్ట్రాల పోలీసు విభాగాలతో రియల్ టైమ్ డేటా షేరింగ్‌తో పాటు తొందరగా ట్రాన్సిట్ వారెంట్లు సాధించే చట్టపరమైన నిబంధనలు పై డీఎస్పీ ట్రైనీలకు ఈ కేసు ద్వారా అవగాహన కల్పించనున్నారు.

# స్వచ్ఛ గుంటూరు యాప్ - పరిశుభ్రతకు భంగం కలిగిస్తే ఫైన్ కట్టాల్సిందే

**బహిరంగ ప్రదేశాల్లో ఉమ్మటం, మూత్రవిసర్జన చేయటం చేస్తే ఫైన్**

**షాపుల్లో ప్లాస్టిక్ కవర్ల వినియోగించే వారికి జరిమానా**

**లైసెన్సు లేకుండా వ్యాపారాలు చేస్తే యాప్ ద్వారా జరిమానా విధింపు**




ఇంతక ముందు ఒక లెక్క ఇప్పుడు ఒక లెక్క! అంతా మారాలి. బహిరంగ ప్రదేశాల్లో ఉమ్మటం. మూత్రవిసర్జన చేయటం, లైసెన్సు లేకుండా వ్యాపారాలు చేయటం, ఇష్టారాజ్యంగా ప్లాస్టిక్ కవర్ల వినియోగించడం. ఇక చేయకూడదు. కాదు కూడదు అని నిబంధనలు ఉల్లంఘిస్తే ఫైన్ కట్టాల్సిందే. గుంటూరు నగరంలో పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యం ఇచ్చే క్రమంలో పౌర స్పృహను పెంచేలా నగరపాలక సంస్థ అధికారులు స్వచ్ఛ గుంటూరు పేరుతో సరికొత్త కార్యాచరణను ప్రారంభించారు. గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో నగర పరిశుభ్రతకు భంగం కల్గించే వారిపై అపరాధ రుసుం విధించేలా అధికారులు చర్యలు చేపట్టారు. పరిశుభ్రత నిబంధనలు ఉల్లంఘించిన వ్యక్తులు, వ్యాపార సంస్థలపై డిజిటల్ చలానాలు జారీ చేస్తున్నారు. దీని కోసం స్వచ్ఛ గుంటూరు పేరుతో ప్రత్యేకంగా మొబైల్ యాప్ రూపొందించారు. కార్పొరేషన్ సిబ్బంది క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ వ్యక్తులతోపాటు దుకాణ యజమానులు ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే వారికి జరిమానా విధించనున్నారు. ఎక్కడపడితే అక్కడ ఉమ్మడం, మూత్రవిసర్జన చేయటం, నిర్దేశిత ప్రమాణాలు లేని ప్లాస్టిక్ సంచుల వాడకాన్ని పరిశీలిస్తారు. నిబంధనలను పాటించకపోతే పేరు తెలుసుకుని ఫోన్లోని యాప్ ద్వారా జరిమానా వేస్తారు. 'దుకాణాలు, వ్యాపార సంస్థలు పాల్పడే ఉల్లంఘనలపైనా కఠిన చర్యలు తీసుకునేలా స్వచ్ఛ గుంటూరు యాప్‌ను ఉపయోగిస్తున్నారు. షాపు ముందు చెత్త వేయటం, నిర్మాణ వ్యర్థాలు రోడ్లపై పోయటం, ప్లాస్టిక్ వేస్ట్ పడేయటం, సరైన పారిశుధ్య చర్యలు పాటించకపోవటం వంటి ఉల్లంఘనలకు పాల్పడిన వ్యాపారస్థులకు కూడా జరిమానా విధిస్తారు. నేరుగా సంబంధిత వ్యక్తి, లేదా వ్యాపార సంస్థ పేరిట అప్పటికప్పుడు చలాన్ రాసి జరిమానా వసూలు చేస్తారు.' -మయూర్ అశోక్, నగరపాలక సంస్థ కమిషనర్ ట్రేడ్ లైసెన్సుల విషయంలో కార్పొరేషన్ సిబ్బంది కఠినంగా వ్యవహరిస్తున్నారు. లైసెన్సు లేని వారికి ఈ యాప్ ద్వారా వెంటనే జరిమానా వేస్తున్నారు. నగరంలో 40వేలకు పైగా దుకాణాలు, వ్యాపార సంస్థలుంటాయని అధికారుల అంచనా. ఇందులో కేవలం 20వేల మంది మాత్రమే నగరపాలకసంస్థ నుంచి ట్రేడ్ లైసెన్స్ తీసుకున్నారు. ఇప్పుడు లైసెన్స్ లేకుండా వ్యాపారాలు చేసేవారిని కట్టడి చేసేందుకు కూడా యాప్ ఉపయోగపడుతుంది. ప్రస్తుతం నగరపాలక సంస్థ సిబ్బంది క్షేత్రస్థాయిలో తిరిగి దుకాణదారులకు, ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. త్వరలో పూర్తిస్థాయిలో యాప్‌ను ఉపయోగించి జరిమానాల వసూళ్లకు సిద్ధమవుతున్నారు. వెంకటరత్నం, దుకాణ యజమాని సాంకేతికతను వినియోగించి పరిశుభ్రత, బాధ్యతాయుత పౌర సేవలను బలోపేతం చేయటంతో పాటు నగరపాలక సంస్థ ఆదాయం పెంచేలా యాప్ ఉపయోగపడనుంది. నగరాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రజలు, వ్యాపార సంస్థలు సహకరించాలని అధికారులు కోరుతున్నారు.

# రైలు పట్టాలపై డ్రోన్, సీసీ కెమెరాలతో నిఘా

**అసాంఘిక శక్తులకు చెక్! , రైల్వేస్టేషన్లలో డ్రోన్ కెమెరాలు**

**అనుమానాస్పద వ్యక్తులపై నిఘా , నిబంధనలు ఉల్లంఘిస్తే జరిమానా విధిస్తున్న ఆర్పీఎఫ్ పోలీసులు**

**వరుస ప్రమాదాలతో అప్రమత్తమైన రైల్వే సిబ్బంది**



రైలుపట్టాలపై అడ్డదిడ్డంగా దాటుతూ వెళ్తున్నారా! గమ్యం చేరేందుకు రైల్వే శాఖ నిబంధనలు ఉల్లంఘిస్తున్నారా! అయితే మీరు కచ్చితంగా అప్రమత్తంగా ఉండాల్సిందే. రైలుపట్టాలపై ప్రమాదాలు, బలవన్మరణాలకు అడ్డుకట్ట వేసేందుకు రైల్వే పోలీసులు రంగంలోకి దిగారు. డ్రోన్, సీసీ కెమెరాలతో మరింత నిఘా పెంచారు. అనుమానాస్పదంగా వ్యవహరించే వారిని గమనిస్తున్నారు. నిబంధనలు ఉల్లంఘించినట్టు గుర్తిస్తే ఫైన్ వేస్తున్నారు. అంతేకాకుండా చట్టపరంగా చర్యలు తీసుకునేందుకు పలు సెక్షన్ల ప్రకారం కేసులు నమోదు చేస్తున్నారు. ఇప్పటి వరకు అవగాహన కల్పించటం, చూసీచూడనట్టు వదిలేసిన రైల్వే పోలీసులు వరుసగా రైలు పట్టాలపై చోటుచేసుకుంటున్న ప్రమాదాలతో అప్రమత్తమయ్యారు. హైదరాబాద్ నగరంలో చాలా ప్రాంతాల్లో రైలు పట్టాలు దాటుతూ ప్రజలు ప్రమాదాల బారిన పడుతున్నారు. సికింద్రాబాద్ రైల్వే జోన్ పరిధిలో ఏటా 1300 నుంచి 1400 మంది రైలు ప్రమాదాల్లో మరణిస్తున్నారు. వీరిలో 700 మంది ప్రమాదవశాత్తూ ప్రాణాలు కోల్పోతున్నవారే ఉంటున్నారు. నిబంధనలు ఎట్టిపరిస్థితుల్లో ఉల్లంఘించ వద్దని పోలీసుల హెచ్చరిస్తున్నా ఎవరూ గమనించట్లేదని కంగారుతో పట్టాలు దాటుతున్నారు. దేశంలోనే రైళ్లపై రాళ్లతో దాడికి పాల్పడే ఘటనలు ఇక్కడే అధికమని పోలీసులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గంజాయి బ్యాచ్‌లు, ఆకతాయిలు, పోకిరీలు ఈ చేష్టలకు పాల్పడుతున్నారని రైల్వే పోలీసులు తెలిపారు. ప్రతి నెలా 30 నుంచి 35 మందిపై కేసులు నమోదవతున్నట్టు విశ్వసనీయ సమాచారం. 200 సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి నిఘా మరింత పెంచనున్నారు. సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ పరిధిలోని తార్నాక వంతెన, స్కూబ్రిడ్జి, జేమ్స్ స్ట్రీట్, రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫాం 10 ప్రాంతాల్లో 10 సోలార్ కెమెరాలు ఏర్పాటు చేశారు. లింగంపల్లి, నాంపల్లి, భరత్‌నగర్, కాజీపేట్ రైల్వేస్టేషన్లలో 20 వరకు ఏర్పాటు చేశారు. వీటి ద్వారా దొంగలు, అనుమానాస్పద వ్యక్తులు, అనుమానితులు, రైల్వేట్రాక్ దాటే ప్రయాణికులను వేగంగా గుర్తిస్తున్నారు. అనుమానితులు, ఆత్మహత్యకు పాల్పడేందుకు వచ్చినట్టు తెలుసుకుని వారిని అదుపులోకి తీసుకుంటున్నారు. వారి వివరాలు సేకరించి నేరుగా కుటుంబ సభ్యులను పిలిపించి అప్పగిస్తున్నారు. ప్రమాదకరంగా రైలు పట్టాలు దాటే వారు, పట్టాలకు ఇరువైపులా ఉన్న కాలనీవాసులు, ప్రయాణికులకు రైల్వేపోలీసులు విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నారు. ప్రమాదకరంగా పట్టాలు దాటబోమని వారితో ప్రమాణం చేయించే కార్యక్రమం కూడా నిర్వహిస్తున్నారు. లింగంపల్లి, నాంపల్లి, భరత్‌నగర్ రైల్వేస్టేషన్లలో పరిధిలో డ్రోన్ కెమెరాలతో నిశితంగా పర్యవేక్షిస్తున్నారు. కిలోమీటరు దూరం వరకు కదలికలను టెక్నాలజీ సాయంతో పసిగడుతున్నారు. రైళ్లపై రాళ్లదాడికి పాల్పడే అసాంఘిక శక్తులు, పట్టాలపై రీల్స్ చేస్తున్న వారిని గుర్తిస్తున్నారు. సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ వైపు డ్రోన్ ఉపయోగించేందుకు మినిస్ట్రీ ఆఫ్ సివిల్ ఏవియేషన్ అనుమతి కోసం రైల్వే పోలీసులు ఇటీవల లేఖ రాశారు. అటు నుంచి వచ్చే తదుపరి ఉత్తర్వుల మేరకు సమస్యపై నిర్ణయం తీసుకోనున్నారు.

# 'సర్' సవరణలో మళ్లీ జల్లెడ

**అన్‌కలెక్టబుల్ ఓటర్ల వివరాలపై పునఃపరిశీలన**


**జులై 14 నాటికి అన్‌ట్రేసబుల్ జాబితాలో 8.24 లక్షల మంది**

**శాశ్వత వలసల విభాగంలో 13.34 లక్షలు**

**సర్ గడువు పొడిగింపుతో మరోసారి జల్లెడ పడుతున్న బీఎల్‌వోలు**

ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రక్రియలో భాగంగా "అన్‌కలెక్టబుల్"గా నమోదు చేసిన ఎన్యూమరేషన్ పత్రాలపై ఎన్నికల యంత్రాంగం మరోసారి దృష్టి సారించింది. తొలిదశలో అందుబాటులోకి రాలేదని డిజిటలైజ్ చేసిన ఓటర్ల వివరాలను ఇప్పుడు బీఎల్‌వోలు ఇంటింటికీ వెళ్లి తిరిగి పరిశీలిస్తున్నారు. ఎన్నికల సంఘం గడువును ఈ నెల 24 వరకు పొడిగించడంతో, తొలిదశలో జరిగిన లోపాలను సరిదిద్దేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. జులై 14 నాటికి రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 43,39,523 మంది ఓటర్ల ఎన్యూమరేషన్ పత్రాలు 'అన్‌కలెక్టబుల్'గా నమోదయ్యాయి. వీరిలో 8,24,862 మంది అన్‌ట్రేసబుల్/అబ్సెంట్ లేదా ఇంట్లో లేరని, 13,34,877 మంది శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిపోయారని నమోదు చేశారు. అలాగే 6,39,545 మంది ఇప్పటికే ఇతర ప్రాంతాల్లో ఓటర్లుగా నమోదయ్యారని, 81,811 మంది ఇతర కారణాలతో అందుబాటులో లేరని పేర్కొన్నారు. మరోవైపు 14,58,428 మందిని మృతులుగా నమోదు చేశారు. అయితే గత రెండు రోజులుగా అన్‌ట్రేసబుల్‌గా గుర్తించిన కొంతమంది ఓటర్లు అందుబాటులోకి రావడంతో, బీఎల్‌వోలు వారి వివరాలను సవరించి మళ్లీ పోర్టల్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. వలస వెళ్లారని నమోదు చేసిన వారి వివరాలపైనా తిరిగి ధృవీకరణ చేపడుతున్నారు. ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం ఇంటింటి సర్వే సమయంలో బీఎల్‌వోలు వారి బూత్ పరిధిలోని ప్రతి ఇంటికీ వెళ్లి ఎన్యూమరేషన్ పత్రాలు పంపిణీ చేయాలి. ఆ తర్వాత వివరాలు నింపిన పత్రాలను ఓటర్ల నుంచి సేకరించేందుకు మళ్లీ వెళ్లాలి. అయితే ఈ ప్రక్రియ ఎక్కడా పూర్తిస్థాయిలో అమలు కాలేదన్న ఆరోపణలు ఉన్నాయి. చాలా చోట్ల బీఎల్‌వోలు ఒక్కసారి కూడా వారి బూత్ పరిధిలోని ఇళ్లకు వెళ్ల లేదు. ఈసీ మొదట ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం జులై 14 నాటికల్లా ఎన్యూమరేషన్ పత్రాల పంపిణీ, వాటి సేకరణ, డిజిటలైజ్ పూర్తి చేయాల్సి ఉండటంతో హడావుడిగా ముగించేశారు. గడువులోగా లక్ష్యాన్ని చేరుకోవాలని కలెక్టర్లు ఒత్తిడి చేయటంతో బీఎల్‌వోలు, ఈఆర్‌వోలు వారి వద్ద పెండింగ్‌లో మిగిలిపోయిన పత్రాలకు ఏదో ఒక కారణం చూపించేసి డిజిటైజ్ చేసేశారనే విమర్శలున్నాయి. ఇదిలా ఉండగా, 2002 ఓటర్ల జాబితాలో తమ కుటుంబ సభ్యుల వివరాలను గుర్తించలేక 'నో మ్యాపింగ్' కింద దరఖాస్తులు సమర్పించిన వారికి కూడా ఎన్నికల సంఘం మరో అవకాశం కల్పించింది. ఇప్పుడు పాత ఓటర్ల జాబితాలోని వివరాలను గుర్తించి మ్యాపింగ్ పూర్తి చేస్తే, వాటిని పోర్టల్‌లో నవీకరించే అవకాశం ఉంది. దీంతో సర్ ప్రక్రియలో మిగిలిన లోపాలను సరిదిద్దుతూ కచ్చితమైన ఓటర్ల జాబితా రూపొందించడమే ఎన్నికల సంఘం లక్ష్యంగా ముందుకు సాగుతోంది.

# విద్యుత్ వినియోగంపై ఎల్‌నినో ప్రభావం



విద్యుత్ ఎక్స్ఛేంజీలు, టర్మ్ అహెడ్ మార్కెట్ ద్వారా అవసరమైన విద్యుత్‌ను ముందుగానే కొనుగోలు చేయాలని డిస్కంలకు సూచన ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో విద్యుత్ వినియోగం మరింత పెరిగే అవకాశం ఉన్న నేపథ్యంలో డిమాండ్‌కు ఎలాంటి అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేయాలని సీఎం ప్రత్యేక ప్రధాన కార్యదర్శి విజయానంద్ విద్యుత్ సంస్థల ఉన్నతాధికారులను ఆదేశించారు. ఆగస్టు నుంచి సెప్టెంబర్ వరకు అంచనా వేస్తున్న విద్యుత్ అవసరాలు, ఉత్పత్తి సామర్థ్యం, థర్మల్ విద్యుత్ కేంద్రాల్లో బొగ్గు నిల్వలు, బహిరంగ మార్కెట్‌లో విద్యుత్ కొనుగోళ్లపై ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. జులై 15న రాష్ట్రంలో విద్యుత్ వినియోగం 285 మిలియన్ యూనిట్లకు చేరి జులై నెల చరిత్రలోనే అత్యధిక డిమాండ్‌గా నమోదైందని పేర్కొన్నారు. రాబోయే నెలల్లో డిమాండ్ మరింత పెరిగే అవకాశమున్నందున విద్యుత్ ఎక్స్ఛేంజీలు, టర్మ్ అహెడ్ మార్కెట్ ద్వారా అవసరమైన విద్యుత్‌ను ముందుగానే కొనుగోలు చేయాలని డిస్కంలకు సూచించారు. అలాగే థర్మల్ కేంద్రాల్లో తగిన బొగ్గు నిల్వలు ఉండేలా చర్యలు తీసుకోవడంతో పాటు ఉత్పత్తి యూనిట్ల నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. సాంకేతిక లోపాలు తలెత్తకుండా ముందస్తు నిర్వహణ చేపట్టాలని, ఎక్కడైనా సమస్యలు తలెత్తితే వెంటనే స్పందించి సరఫరా పునరుద్ధరించేలా సిద్ధంగా ఉండాలని స్పష్టం చేశారు. గురువారం ఉభయ గోదావరి జిల్లాల్లో చోటు చేసుకున్న విద్యుత్ అంతరాయం గురించి కూడా విజయానంద్ వివరించారు. ఉదయం 11.53 గంటలకు వేమగిరి 220 కేవీ ఉపకేంద్రంలో సాంకేతిక లోపం తలెత్తడంతో బస్ కప్లర్ సమీపంలోని జంపర్ తెగిపోయి సబ్‌స్టేషన్ పరిధిలోని ఐసీటీలు ట్రిప్ అయ్యాయని తెలిపారు. దీంతో గుడ్డిగూడెం, కామవరపుకోట 220 కేవీ సబ్‌స్టేషన్లలోని ట్రాన్స్‌ఫార్మర్లు ఓవర్‌లోడ్‌కు గురై కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడిందన్నారు. అయితే ట్రాన్స్‌కో, జెన్కో, డిస్కంల సిబ్బంది సమన్వయంతో వేగంగా స్పందించి కేవలం 37 నిమిషాల్లోనే, మధ్యాహ్నం 12.30 గంటలకే విద్యుత్ సరఫరాను పూర్తిగా పునరుద్ధరించినట్లు వెల్లడించారు. ఈ ఘటనకు గల కారణాలను సాంకేతిక నిపుణులతో సమగ్రంగా విశ్లేషిస్తున్నామని, భవిష్యత్తులో ఇటువంటి సమస్యలు పునరావృతం కాకుండా ప్రసార వ్యవస్థను మరింత బలోపేతం చేసే చర్యలు చేపడతామని విజయానంద్ తెలిపారు. రాష్ట్రంలో పెరుగుతున్న విద్యుత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని అన్ని విద్యుత్ సంస్థలు సమన్వయంతో పనిచేసి వినియోగదారులకు నిరంతరాయంగా విద్యుత్ అందించేందుకు సిద్ధంగా ఉండాలని ఆయన ఆదేశించారు.

# మీ ఇంట్లో ఎమర్జెన్సీ ఫండ్ ఉందా - ఇలా కూడబెట్టండి!

**కష్టకాలంలో ఆదుకునేది ఎమర్జెన్సీ ఫండ్ మాత్రమే**

**జమ చేయడానికి, దాచడానికి సూపర్ టిప్స్**

**చెబుతున్న నిపుణులు**




అవసరాలు చెప్పి వస్తాయా అందుకే, వాటిని ఆపలేకపోయినా, ఎదుర్కోవడానికి మాత్రం మనం సిద్ధంగా ఉండాలి. ఇందుకు మానసిక సన్నద్ధత రెండోదైతే, మొదటి మాత్రం డబ్బే! అవును, ముందుగు మనీ సమకూర్చుకుంటే, ఆ తర్వాత మెల్లగా మనసును సంభాళించుకోవచ్చు. మరి, అత్యవసర సమయంలో ఆదుకునేందుకు మీ వద్ద ఎమర్జెన్సీ ఫండ్ ఉందా "లేదు" అంటే మాత్రం ఇప్పుడే కొద్ది కొద్దిగా పక్కన పెట్టడం మొదలు పెట్టండి. అకస్మాత్తుగా ఉద్యోగం కోల్పోవడం, అనారోగ్యం పాలవడం, వ్యాపారాలు దెబ్బతినడం వంటి పరిస్థితుల్లో ఆదుకోవడానికి ముందే జాగ్రత్తగా దాచి పెట్టుకునే ప్రత్యేక నిధినే ఎమర్జెన్సీ ఫండ్ అంటారు. పొదుపు అంటే చాలా మంది ఇల్లు కొనడానికో, పిల్లల పెళ్లిళ్ల కోసమో, రిటైర్మెంట్ కోసమో అనుకుంటారు. కానీ, వాటన్నింటికంటే ముందుగా ఆదాయంలోంచి తీసి పక్కన పెట్టాల్సింది అత్యవసర నిధే అంటున్నారు నిపుణులు. ప్రస్తుత ప్రపంచంలో ఏ ఉద్యోగం ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితి, ఏ అవసరం ఎప్పుడొస్తుందో అర్థంకాని పరిస్థితి. అందుకే, ఎలాంటి ఆదాయం లేకపోయినా కనీసం ఆర్నెల్ల పాటు ఇల్లు గడిచేంత డబ్బును ఎమర్జెన్సీ ఫండ్‌గా పక్కన పెట్టుకోవాలని సూచిస్తున్నారు. కేవలం రోజూవారి ఖర్చులే కాదు, ఇంటి అద్దె మొదలు, పిల్లల ఫీజులు, ఈఎంఐలు, ఇన్సూరెన్స్ ప్రీమియాలు ఇవన్నీ లెక్కలోకి తీసుకోవాలి. ఈ లోగా మరో ఉద్యోగం వెతుక్కోవడానికి సమయం లభిస్తుందని సూచిస్తున్నారు. చాలా మంది చేసే అతిపెద్ద తప్పు ఏంటంటే.. ఆదాయం పెరుగుతున్న కొద్దీ, ఖర్చులు కూడా పెంచుకుంటూ పోతారు. ఒక రూ. 50 వేలు దాచిపెట్టి, దాన్నే పర్మనెంట్ ఎమర్జెన్సీ ఫండ్ గా భావిస్తుంటారు. కానీ, ప్రతీఏటా ఆదాయం పెరుగుతున్నకొద్దీ ఎమర్జెన్సీ ఫండ్ పర్సెంటేజ్ కూడా పెంచుతూ పోవాలని సూచిస్తున్నారు. దీనినే 'డైనమిక్ ఎమర్జెన్సీ ఫండ్' అంటారు. కాలక్రమేణా మీ వయస్సు పెరిగే కొద్దీ, పిల్లలు పుట్టినప్పుడు, వారి చదువుల ఖర్చులు పెరిగినప్పుడు లేదా మీ జీవన ప్రమాణాలు మారినప్పుడు దానికి అనుగుణంగా మీ నెలవారీ ఖర్చులు కూడా ఆటోమేటిక్‌గా పెరుగుతాయి. ఎమర్జెన్సీ వచ్చినప్పుడు ఫండ్‌లోంచి కొంత మొత్తం తీసి వాడుకుంటే, సాధ్యమైనంత త్వరగా దాన్ని నింపాల్సి ఉంటుంది. లేదంటే మరోసారి అత్యవసర పరిస్థితి వచ్చినప్పుడు ఇబ్బందులు ఎదురవుతాయి. అందుకే తప్పకుండా నిధి ఎప్పుడూ నిండుగా ఉండేలా చూసుకోవాలి. అవసరమైతే ఆ ఖాళీ భర్తీ చేసేంత వరకు మీ ఇతర ఖర్చులను తప్పకుండా తగ్గించుకోవాలని ఆర్థిక నిపుణులు సూచిస్తున్నారు. ఇప్పటి వరకు చెప్పుకున్నవన్నీ ఎమర్జెన్సీ ఫండ్ ప్రాధాన్యతలు, దానివల్ల కలిగే లాభాలు. మరి, ఎంతో కొంత అత్యవసర నిధిని సిద్ధం చేసుకోవడం మొదలు పెట్టారనే అనుకుందాం. మరి, ఆ సొమ్మును ఎక్కడ దాచాలి అనేది అత్యంత కీలకమైన విషయం. ఎమర్జెన్సీ ఫండ్ అంటేనే, ఎప్పుడు కావాలంటే అప్పుడు చేతిలోకి రావాలి. కాబట్టి, అలా వెంటనే అందేంత దూరంలోనే ఆ డబ్బును దాచాలి. రియల్ ఎస్టేట్‌లోనో, బంగారంలోనో పెట్టుబడి పెడితే ఇబ్బందులు ఎదురవ్వొచ్చు. పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్, నేషనల్ సేవింగ్స్ సర్టిఫికెట్లలో పెట్టినా కూడా సమయానికి డబ్బులు విత్‌డ్రా చేసుకోలేము. అలాగనీ బీరువాలో డబ్బు దాచుకోవడం కూడా శ్రేయస్కరం కాదు. చోరీలు జరుగుతాయని కాకపోయినా, ఇంట్లోనే ఉన్నందున ప్రతీ చిన్న అవసరానికీ చెయ్యి వాటి మీదకే వెళ్లే అవకాశం ఉంటుంది. అంతేకాకుండా, బీరువా మనకు వడ్డీ కూడా ఇవ్వదు. మరి, ఏం చేయాలంటే, 3 పద్ధతుల్లో ఈ డబ్బును దాచుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. ఎర్జెన్సీ ఫండ్‌ను 3 భాగాలు చేయాలి. అందులో 30 శాతం డబ్బును సాధారణ సేవింగ్స్ బ్యాంక్ ఖాతాలో ఉంచాలి. దీనివల్ల ఏటీఎం ద్వారా నిమిషాల్లోనే డ్రా చేసుకోవచ్చు. రెండోది ఫ్లెక్సిబుల్ ఫిక్స్‌డ్ డిపాజిట్లలో పెట్టాలి. వడ్డీ వస్తుంది, పెనాల్టీ లేకుండానే వెంటనే సేవింగ్స్ అకౌంట్ లోకి వచ్చేస్తాయి. మూడోది మ్యూచువల్ "లిక్విడ్ ఫండ్స్". ఇవి షేర్ మార్కెట్ తో సంబంధం లేకుండా చాలా సురక్షితమైన ప్రభుత్వ సెక్యూరిటీలలో పెట్టుబడి పెడతాయి. వీటిలో బ్యాంక్ ఎఫ్‌డీల కంటే కాస్త మెరుగైన వడ్డీనే వచ్చే ఛాన్స్ ఉంటుంది. అంతేకాకుండా మొబైల్ యాప్ ద్వారా 24 గంటల్లోనే డబ్బు విత్‌డ్రా చేసుకోవచ్చు. ఈ విధంగా సెక్యూర్ చేసుకోవడం వల్ల ఎమర్జెన్సీ డబ్బు కూడా వడ్డీని జనరేట్ చేస్తుందని నిపుణులు సూచిస్తున్నారు.

# తెలిసిన వారే కదా అని మనీ ట్రాన్స్‌ఫర్ చేస్తున్నారా

**ఈ ప్రమాదంలో పడే ఛాన్స్!**

**తెలియకుండానే మ్యూల్ ఖాతాలుగా మారిపోతున్నవారు ఎందరో!**

**తీవ్రంగా హెచ్చరిస్తున్న రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా**




ఒక వ్యక్తి చిన్న బిజినెస్ నడుపుతున్నాడు. తెలిసిన వ్యక్తి ఒకరు వచ్చి, "నా వద్ద 10 వేల రూపాయల క్యాష్ ఉంది. ఫ్రెండ్‌కు అర్జెంటుగా పంపించాలి. ఈ క్యాష్ తీసుకొని, ఆన్‌లైన్ ద్వారా మా ఫ్రెండ్ నంబర్‌కు పంపిస్తారా ప్లీజ్" అని రిక్వెస్ట్ చేశాడు. అయ్యో దానికేముంది ఇలా ఇవ్వండి అని క్యాష్ తీసుకున్నాడు. అతని ఫ్రెండ్ మొబైల్ నంబర్ చెప్పమని, వెంటనే యూపీఐ ద్వారా 10 వేల రూపాయలు ట్రాన్స్‌ఫర్ చేసేసి, తన పనిలో మునిగిపోయాడు. వారం రోజుల తర్వాత ఉదయాన్నే పోలీస్ జీప్ వచ్చి అతని ఇంటి ముందు ఆగింది. మిమ్మల్ని విచారించాలి స్టేషన్‌కు పదండి అన్నారు. "ఏం జరిగింది సార్ తప్పుడు అడ్రస్‌కు వచ్చినట్టున్నారు!" అని అతను భయపడుతున్నాడు. "కరెక్టు పర్సన్ వద్దకే వచ్చాం పదండి". అంటూ పోలీసు వాహనం ఎక్కించారు. అక్కడికి వెళ్లిన తర్వాత.. పలానా తేదీన మీరు ఈ నంబర్‌కు రూ. 10 వేలు పంపించారు. అతనికి, నీకు ఏంటి సంబంధం అని ప్రశ్నించారు. ఆరోజు జరిగింది ఆయన చెప్పాడు. మీరు డబ్బు పంపింది సైబర్ నేరగాళ్లకు. మీరు కూడా ఆ గ్యాంగ్‌లో సభ్యులు కాదని గ్యారెంటీ ఏంటి అని నిలదీశారు. హతాశుడైన ఆ వ్యక్తికి పై ప్రాణాలు పైన్నే పోయినంత పనైంది. ఇలా, నగదు అక్రమ చెలామణిలో ఇరుక్కుపోతున్న అమాయకులు బోలెడంత మంది. తమకు తెలియకుండానే మ్యూల్ ఖాతాలుగా మారిపోతున్న వారు ఇంకెంతో మంది. సైబర్ నేరగాళ్లు తెలివిగా వ్యవహరిస్తూ, ఇలాంటి వాళ్లను వాడుకుని, నేరాల్లో ఇరికిస్తున్నారు. ఇలాంటి వాటిల్లో చిక్కుకోకుండా ఉండాలంటే మ్యూల్ ఖాతాలుగా మారకుండా జాగ్రత్తపడాలని సాక్షాత్తూ రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా హెచ్చరిస్తోంది. సైబర్ నేరగాళ్లు తాము దోచుకున్న డబ్బును చట్టబద్ధంగా మార్చుకోవడానికి ఇతరుల బ్యాంక్ ఖాతాలను వాడుకుంటారు. ముందుగా వాళ్ల ఖాతాల్లోకి నగదు బదిలీ చేసి, ఆ తర్వాత మరో ఖాతాలోకి ట్రాన్స్‌ఫర్ చేయాలని కోరుతారు. ఇలా నేరగాళ్ల కోసం డబ్బు అక్రమంగా బదిలీ చేయడానికి ఉపయోగపడే బ్యాంక్ ఖాతాలనే 'మ్యూల్ ఖాతాలు' అంటారు. తెలిసిన వారేననే కారణంతోనో, కమీషన్ ఇస్తారన్న ఆశతోనో మీ బ్యాంక్ ఖాతాను ఇతరులకు వాడుకోనిస్తే ఖతమే! మీరు తీవ్రమైన ప్రమాదంలో పడినట్లేనని అధికారులు హెచ్చరిస్తున్నారు. సైబర్ ముఠాలు సాధారణంగా విద్యార్థులు, గృహిణులు, నిరుద్యోగులను టార్గెట్ చేస్తారు. పార్ట్ టైమ్ జాబ్స్ పేరుతో వలవేస్తారు. ఇంట్లో కూర్చుని డబ్బు సంపాదించవచ్చు అంటారు. మీకు ఆన్‌లైన్‌లో ఏదో పని కేటాయిస్తారు. దానికి ప్రతిగా కమీషన్ చెల్లిస్తామని చెబుతారు. అలా డబ్బును మీ ఖాతాలో వేస్తారు. తిరిగి మరో ఖాతాకు పంపించాలని చెబుతారు. పాత పరిచయాలతోనో, మీ బంధువులకు తెలిసిన వారిమనో నమ్మించి, అత్యవసరంగా డబ్బు పంపించాలంటూ మీ ఖాతాలను వాడుకుంటారు. ఇలాంటి వ్యవహారాల విషయంలో అత్యంత జాగ్రత్తగా ఉండాలని ఆర్బీఐ హెచ్చరిస్తోంది. చాలా కేసుల్లో అమాయకులు కూడా ఉంటారు. నిజానికి వారికి, నేరాలకు ఎలాంటి సంబంధమూ ఉండదు. కానీ, ఇలా ఒక చిన్న పొరపాటు ద్వారా తమకు తెలియకుండానే ఆ నేరంలో భాగమైపోతారు. అందుకే అనుమానాస్పద లావాదేవీలకు మీ బ్యాంకు ఖాతాలను ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించకూడదని ఆర్బీఐ హెచ్చరిస్తోంది. మీ అకౌంట్లోకి డబ్బు పంపేవారు ఎవరు ఎందుకు పంపుతున్నారు మీరు ఎవరికి సెండ్ చేస్తున్నారు ఎందుకు చేస్తున్నారు అనేది తప్పకుండా తెలిసే ఉండాలని చెబుతోంది. మీ బ్యాంక్ ఖాతాకు వంద శాతం మీదే బాధ్యత. చాలా మంది తమకు తెలియకుండా జరిగింది కాబట్టి, తమకు ప్రమాదం ఏమీ ఉండదని అనుకుంటారు. కానీ, చట్టం దృష్టిలో నేరగాడితోపాటు మీరూ చిక్కుల్లో పడే ప్రమాదం ఉంటుంది. మనీ లాండరింగ్, ఐటీ చట్టాల కింద విచారణ ఎదుర్కోవాల్సి వస్తుంది. మీ బ్యాంక్ అకౌంట్లు, క్రెడిట్ కార్డులు బ్లాక్ అవడంతోపాటు చాలా ఇబ్బందులు వస్తాయని ఆర్బీఐ హెచ్చరిస్తోంది. అందుకే తెలియని వారికి మీ బ్యాంకు ఖాతాలను ఉపయోగించుకునే అవకాశం అస్సలే ఇవ్వకూడదు. మీ బ్యాంక్ లాగిన్ వివరాలు, పాస్‌వర్డ్‌లు, వ్యూ వంటివి ఎవరికీ షేర్ చేయకూడదు. మీకు సంబంధం లేని డబ్బును వేరే వ్యక్తులు మీ అకౌంట్లో వేస్తామని చెప్పినా, మీ చేతిలో క్యాష్ పెట్టి మరొకరికి పంపించాలని కోరినా, ఒకటికి వందసార్లు ఆలోచించుకోవాలి. తెలిసో తెలియకో ఇలాంటి లావాదేవీలు జరిగితే వెంటనే సైబర్ క్రైమ్ అధికారులు ఫిర్యాదు చేయాలి. లేకపోతే ఇబ్బందులు తప్పవని ఆర్బీఐ హెచ్చరిస్తోంది.

# 'ఇన్‌స్టెంట్ లోన్ యాప్స్'లో ముందుగా ఏం చెక్ చేయాలి

**ఎంత వరకు సురక్షితం**

**రుణ అవసరాలు తీరుస్తున్న ఇన్‌స్టెంట్ లోన్ యాప్స్**

**ఎంత వరకు సేఫ్**



ఆరోగ్యం, ఇతర అత్యవసర పరిస్థితుల్లో చాలా మంది 'ఇన్‌స్టంట్ లోన్స్' తీసుకుంటుంటారు. స్కూల్, కళాశాల ఫీజు, ప్రయాణాలు, ఇంటి పునరుద్ధరణ, వివాహాలు, అనేక చిన్న రుణాలను క్లియర్ చేయడానికి వీటిని ఆశ్రయిస్తుంటారు. యాప్‌ల ద్వారా తీసుకున్న ఇన్‌స్టంట్ రుణాలను కేవలం అత్యవసర పరిస్థితులకే కాకుండా ప్రణాళికాబద్ధమైన ఆర్థిక లక్ష్యాలను సాధించడానికి వ్యూహాత్మకంగానూ ఉపయోగించొచ్చు. ఈ రుణాలకు సంబంధించి డిజిటల్ లోన్ యాప్‌లు అందుబాటులో ఉండడం వల్ల తొందరగా డబ్బు చేతికందుతోంది. కానీ, చాలా మందికి ఇన్‌స్టంట్ లోన్ యాప్‌లు అంటే కొన్ని అపోహలున్నాయి. అవేంటో తెలుసుకుందాం. రుణ సేవల్లో అనేక డిజిటల్ లోన్ యాప్‌లు అందుబాటులో ఉన్నాయి. భౌతికంగా పత్రాలు అవసరం లేకుండానే రుణాలు మంజూరు చేయడంతో పాటు చాలా మంది ఈ సేవలను వినియోగించుకుంటున్నారు. సంప్రదాయ పద్ధతులకు భిన్నంగా రోజుల తరబడి నిరీక్షించే అవసరం లేకపోవడంతో ఎక్కువమంది ఆకర్షితులవుతున్నారు. ప్రమాణాలు పాటించే లోన్ యాప్‌లు ఎలా పని చేస్తాయి దరఖాస్తుదారులు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి అనే విషయాలు తెలుసుకుందాం. డిజిటల్ లోన్ యాప్‌లు అసురక్షితమైనవి అనేది అతి పెద్ద అపోహ. నిజమైన లోన్ యాప్‌లు వినియోగదారుల డేటాను రక్షించడానికి ఎండ్-టు-ఎండ్ ఎన్‌క్రిప్షన్, సురక్షితమైన ఖీజ ధ్రువీకరణను ఉపయోగిస్తాయి. =దీ× మార్గదర్శకాలను పాటిస్తూ మెరుగైన ఆర్థిక భాగస్వాములతో కలిసి మాత్రమే పనిచేస్తాయి. అయితే, రుణానికి దరఖాస్తు చేయడానికి ముందు లోన్ యాప్ సంబంధించిన చీదీఖీజ భాగస్వామి పేరును వెల్లడిస్తుందా లేదా లేక, వడ్డీ రేట్లు, ప్రాసెసింగ్ ఫీజులపై దానికి పారదర్శకమైన నిబంధనలు ఉన్నాయో, లేదో వినియోగదారులు తప్పక తనిఖీ చేయాలి. రుణ సంస్థలు అధిక జీతం/ఆదాయం ఉన్న వారికి రుణాలు ఇవ్వడానికి ఆసక్తి చూపిస్తుంటాయి. ఇన్‌స్టంట్ లోన్ యాప్‌లు దిగువ, మధ్య తరగతి ఆదాయ వర్గాలకు కూడా రుణాలు మంజూరు చేస్తున్నాయి. ఈ మేరకు బ్యాంకులకు భిన్నంగా ప్రత్యామ్నాయ క్రెడిట్ మూల్యాంకన నమూనాలను ఉపయోగిస్తున్నాయి. బ్యాంకర్లు లోన్ మంజూరు చేయడానికి కఠినమైన అర్హత ప్రమాణాలను పాటిస్తుంటారు. కానీ, భారత్‌లోని ఆధునిక ఇన్‌స్టంట్ లోన్ యాప్‌లు ప్రత్యామ్నాయ క్రెడిట్ మూల్యాంకన నమూనాలను ఉపయోగిస్తూ గత చరిత్రను పరిగణలోకి తీసుకుంటున్నాయి. కేవలం వేతనం, ఆదాయం మాత్రమే కాకుండా ఖర్చు తీరు, డిజిటల్ లావాదేవీలు, రుణ చెల్లింపుల చరిత్రను పరిశీలిస్తున్నాయి. దీంతో ఉద్యోగులు, ఫ్రీలాన్సర్లు, స్వయం ఉపాధి నిపుణులు కూడా రుణ సాయం పొందుతున్నారు. లోన్ యాప్‌లు అధిక వడ్డీ వసూలు చేస్తాయనేది అపోహ మాత్రమే అని ఆర్థిక నిపుణులు వెల్లడిస్తున్నారు. దరఖాస్తుదారుల క్రెడిట్ ప్రొఫైల్‌పై ఆధారపడి వడ్డీ రేట్లు ఉంటాయని గుర్తుంచుకోవాలి. వడ్డీ చెల్లింపుల విషయాన్ని చాలా డిజిటల్ లోన్ ప్లాట్‌ఫాంలు ముందుగానే వెల్లడిస్తాయి. ఈ విషయాన్ని పరిశీలించుకుని ధ్రువీకరించుకున్న తర్వాత వినియోగదారులు సరైన నిర్ణయం తీసుకోవచ్చు. లోన్ తీసుకోవడానికి ముందుగానే మీ ఆర్థిక పరిస్థితికి సరిపోయే చెల్లింపుల వ్యవధి, లోన్ జువీ× కాలిక్యులేటర్ కూడా ఉపయోగించవచ్చు. ఆఫర్ ఖరారు చేసే ముందు ఇతర రుణ యాప్‌లతో వడ్డీ రేట్లను పోల్చి చూసుకోవాలి. ప్రాసెసింగ్ ఫీజులను ముందుగానే చెక్ చేసుకోవడం మంచిది. డిజిటల్ లోన్ యాప్‌లు వ్యక్తిగత డేటాను థర్డ్ పార్టీతో పంచుకుంటాయన్నది అపోహ మాత్రమే. నమ్మదగిన యాప్‌లు డేటాకు సంబంధించి కఠినమైన గోప్యతా నియమాలను తప్పక పాటిస్తాయి. =దీ× ఆమోదిత చీదీఖీజల నియంత్రణలో ఉన్న యాప్‌లు మీ వ్యక్తిగత సమాచారాన్ని భద్రంగా ఉంచుతాయి. అవి భారతదేశ డేటా రక్షణ నిబంధనలకు లోబడి పనిచేస్తాయి. సురక్షితమైన లోన్ యాప్ కోసం నుంచి డౌన్‌లోడ్ చేసుకోవడం మంచిది. యాప్‌నకు అనుమతుల విషయంలో ఆచితూచి వ్యవహరించాలి.

## కొత్త ఫీచర్లతో రాయల్ ఎన్‌ఫీల్డ్ క్లాసిక్ 350

**రైడింగ్ ఇక మరింత సులభం!**

**రాయల్ ఎన్‌ఫీల్డ్ క్లాసిక్ 350లో కొత్త అప్‌డేట్స్**

**అసిస్ట్ అండ్ స్లిప్పర్ క్లచ్, టైప్-సి ఛార్జింగ్ పోర్ట్ జోడింపు**

**డ్యూయల్ ఛానల్ ఏబీఎస్ వేరియంట్లలో మాత్రమే ఈ మార్పులు**

**కొత్త ఫీచర్లతో స్వల్పంగా పెరిగిన బైక్ ధరలు**

**రెండు పాత రంగులను నిలిపివేసిన సంస్థ**



ప్రముఖ ఆటోమొబైల్ సంస్థ రాయల్ ఎన్‌ఫీల్డ్ తన అత్యంత ప్రజాదరణ పొందిన మోడల్ క్లాసిక్ 350 బైక్ ని 2026 కోసం అప్‌డేట్ చేసింది. ఈ కొత్త వెర్షన్‌లో రైడింగ్ అనుభవాన్ని మరింత మెరుగుపరిచేందుకు కీలకమైన ఫీచర్లను జోడించింది. ప్రధానంగా అసిస్ట్ అండ్ స్లిప్పర్ క్లచ్, వేగవంతమైన యూఎస్‌బీ టైప్-సి ఛార్జింగ్ పోర్ట్‌ను అమర్చింది. ఈ అప్‌డేట్‌లో భాగంగా అందించిన అసిస్ట్ అండ్ స్లిప్పర్ క్లచ్ వల్ల ట్రాఫిక్‌లో క్లచ్ వాడకం తేలికవుతుంది. అలాగే, వేగంగా వెళుతున్నప్పుడు అకస్మాత్తుగా గేర్లు తగ్గించినప్పుడు వెనుక చక్రం అదుపు తప్పకుండా ఇది నివారిస్తుంది. పాత యూఎస్‌బీ పోర్ట్ స్థానంలో వేగవంతమైన ఛార్జింగ్ కోసం కొత్త టైప్-సి పోర్ట్‌ను కూడా చేర్చారు. అయితే, ఈ కొత్త ఫీచర్లు కేవలం డ్యూయల్-ఛానల్ ఏబీఎస్ వేరియంట్లలో మాత్రమే అందుబాటులో ఉంటాయని కంపెనీ స్పష్టం చేసింది. ఈ మార్పులతో డ్యూయల్-ఛానల్ ఏబీఎస్ వేరియంట్ల ప్రారంభ ధర (ఎక్స్-షోరూమ్, ఢిల్లీ) రూ. 1.95 లక్షలకు పెరిగింది. టాప్-ఎండ్ వేరియంట్ ధర రూ. 2.24 లక్షల వరకు ఉంది. బేస్ మోడల్ అయిన సింగిల్-ఛానల్ ఏబీఎస్ 'రెడ్డిచ్ రెడ్' వేరియంట్ ధరలో (రూ. 1.87 లక్షలు) ఎలాంటి మార్పు లేదు, ఇందులో ఈ కొత్త ఫీచర్లు ఉండవు. ఈ అప్‌డేట్‌లో భాగంగా హల్సియాన్ బ్లాక్, జోధ్‌పూర్ బ్లూ రంగులను నిలిపివేసి, ప్రస్తుతం ఏడు రంగుల్లో ఈ బైక్‌ను అందిస్తోంది. ఇంజిన్, ఛాసిస్‌లో ఎలాంటి మార్పులు చేయలేదు. అదే 349సీసీ జే-సిరీస్ సింగిల్-సిలిండర్ ఇంజిన్ (20.2 హెచ్‌పీ, 27 ఎన్‌ఎమ్ టార్క్) కొనసాగుతుంది. ఈ అప్‌డేట్‌తో రాయల్ ఎన్‌ఫీల్డ్ 350సీసీ లైనప్‌లో అసిస్ట్ అండ్ స్లిప్పర్ క్లచ్ ఫీచర్ లేని ఏకైక మోడల్‌గా బుల్లెట్ 350 ఒక్కటే మిగిలింది.

## మూడు రోజుల నష్టాలకు బ్రేక్.. బలపడిన రూపాయి

**మూడు రోజుల నష్టాలకు తెర.. 4 పైసలు లాభపడిన రూపాయి**

**డాలర్ సూచీ నెల రోజుల కనిష్టానికి పడిపోవడంతో సానుకూలత**

**క్రూడ్ ఆయిల్ ధర బ్యారెల్‌కు 85 డాలర్లకు చేరడంతో పరిమితమైన లాభాలు**

**పుంజుకున్న బంగారం ధర.. దిగివచ్చిన వెండి**

**భారీ నష్టాల్లో ఆసియా స్టాక్ మార్కెట్లు**



అమెరికా డాలర్‌తో పోలిస్తే భారత రూపాయి మారకం విలువ మూడు రోజుల వరుస నష్టాలకు ఈరోజు బ్రేక్ వేసింది. ఉదయం ట్రేడింగ్‌లో రూపాయి 4 పైసలు బలపడి 96.31 వద్ద ప్రారంభమైంది. గత సెషన్‌లో ఇది 96.35 వద్ద ముగిసిన విషయం తెలిసిందే. అంతర్జాతీయంగా డాలర్ బలహీనపడటంతో రూపాయికి ఈ మాత్రం ఊరట లభించింది. ప్రపంచంలోని ఆరు ప్రధాన కరెన్సీలతో పోల్చే డాలర్ ఇండెక్స్ నెల రోజుల కనిష్ఠ స్థాయికి పడిపోవడం రూపాయికి కలిసొచ్చింది. అమెరికాలో ద్రవ్యోల్బణం అంచనాల కంటే తక్కువగా నమోదు కావడంతో ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లను వెంటనే పెంచకపోవచ్చనే అంచనాలు పెరిగాయి. దీంతో డాలర్ విలువ తగ్గింది. మార్కెట్ వర్గాల ప్రకారం జులైలో వడ్డీ రేట్ల పెంపు ఉండకపోవచ్చని, కానీ సెప్టెంబర్‌పై ఇంకా అనిశ్చితి కొనసాగుతోందని విశ్లేషకులు భావిస్తున్నారు. అయితే, ముడి చమురు ధరలు పెరగడం రూపాయి లాభాలకు అడ్డుకట్ట వేసింది. అమెరికా, ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు తీవ్రం కావడంతో బ్రెంట్ క్రూడ్ ఆయిల్ ధర బ్యారెల్‌కు 85 డాలర్ల సమీపానికి చేరింది. ఈరోజు ఉదయం బ్రెంట్ క్రూడ్ 1.48% పెరిగి 85.48 డాలర్ల వద్ద, డబ్ల్యూటీఐ క్రూడ్ 1.60% పెరిగి 80 డాలర్ల వద్ద ట్రేడ్ అయ్యాయి. మరోవైపు ఆసియా ఈక్విటీ మార్కెట్లు భారీ నష్టాల్లో కొనసాగుతున్నాయి. జపాన్ నిక్కీ 4 శాతానికి పైగా పతనం కాగా, హాంగ్‌కాంగ్, చైనా మార్కెట్లు కూడా నష్టపోయాయి. ఇక, దేశీయంగా బంగారం ధరలు పెరిగాయి. భౌగోళిక ఉద్రిక్తతల వల్ల సురక్షిత పెట్టుబడిగా భావించే బంగారం ధరలు పెరగ్గా, వెండి ధరలు మాత్రం తగ్గుముఖం పట్టాయి.

## రోజంతా హెచ్చుతగ్గులు... ఫ్లాట్‌గా ముగిసిన దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు

**సెన్సెక్స్‌కు 1.44 పాయింట్ల లాభం.. నిఫ్టీకి 5.75 పాయింట్ల నష్టం**

**ఫైనాన్షియల్ షేర్లపై అమ్మకాల ఒత్తిడి**


**కన్స్యూమర్ డ్యూరబుల్స్, ఐటీ సూచీలకు లాభాలు**

**జూన్ త్రైమాసిక ఫలితాలపై ఇన్వెస్టర్ల దృష్టి**

**నిఫ్టీకి 24,200 నిరోధం.. 24,000 మద్దతు**




భౌగోళిక ఉద్రిక్తతలు, ముడిచమురు ధరల్లో హెచ్చుతగ్గులు, ఆసియా మార్కెట్ల బలహీన సంకేతాల ప్రభావంతో భారత స్టాక్ మార్కెట్లు గురువారం ఫ్లాట్‌గా ముగిశాయి. సూచీలు రోజంతా భారీ హెచ్చుతగ్గులు నమోదు చేశాయి. ఆర్థిక రంగ షేర్లలో అమ్మకాల ఒత్తిడి మార్కెట్‌పై ప్రభావం చూపింది. సెన్సెక్స్ 1.44 పాయింట్లు పెరిగి 77,186.87 వద్ద ముగిసింది. నిఫ్టీ 5.75 పాయింట్ల స్వల్ప నష్టంతో 24,072.75 వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో సెన్సెక్స్ 77,579.69 వద్ద గరిష్ఠాన్ని, 77,086.42 దగ్గర కనిష్ఠ స్థాయిని తాకింది. నిఫ్టీ 24,186.50 గరిష్ఠం, 24,050 కనిష్ఠాన్ని నమోదు చేసింది. రంగాల వారీగా చూస్తే కన్స్యూమర్ డ్యూరబుల్స్, కెమికల్స్, మీడియా, ఐటీ, ఆటో సూచీలు లాభాల్లో ముగిశాయి. మరోవైపు ఫైనాన్షియల్ సర్వీసెస్, రియాల్టీ, పీఎస్‌యూ బ్యాంక్, ప్రైవేట్ బ్యాంక్ సూచీలు నష్టాల్లో ముగిశాయి. నిఫ్టీ-50 సూచీలో హెచ్‌సీఎల్ టెక్, ఇండిగో, విప్రో, మారుతీ, బజాజ్ ఫైనాన్స్ షేర్లు లాభపడ్డాయి. ఎటర్నల్, ఎస్‌బీఐ లైఫ్, బజాజ్ ఫిన్‌సర్వ్, బీఈఎల్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ షేర్లు నష్టాల్లో స్థిరపడ్డాయి. జూన్ త్రైమాసిక ఫలితాలు, కంపెనీల యాజమాన్యాల వ్యాఖ్యలు, రుతుపవనాల పురోగతి, అంతర్జాతీయ పరిణామాలు, ద్రవ్యోల్బణ ధోరణులు మార్కెట్‌కు కీలకంగా మారనున్నాయని విశ్లేషకులు తెలిపారు. సాంకేతికంగా నిఫ్టీకి 24,200 స్థాయి తక్షణ నిరోధకంగా ఉండగా, 24,000 స్థాయి కీలక మద్దతుగా ఉంటుందని అంచనా వేశారు.




## ప్రభాస్ ఫ్యాన్స్‌కి గుడ్ న్యూస్.. 'ఫౌజీ' రిలీజ్ డేట్ వచ్చేసింది

ప్రభాస్ ప్యాన్స్‌కి గుడ్ న్యూస్. ఆయన హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'ఫౌజీ' ఈ ఏడాదిలోనే ప్రేక్షకుల ముందుకు రానుంది. డిసెంబర్ 3న ఈ మూవీ విడుదల కానుంది. ఈ మేరకు చిత్రబృందం రిలీజ్ డేట్‌ని ప్రకటిస్తూ కొత్త పోస్టర్ విడుదల చేసింది. అందులో ప్రభాస్.. యుద్ధంలో ఒంటి నిండా రక్తంతో, తుపాకీపై చేయి పెట్టి కూర్చొని ఉన్నాడు. మునుపెన్నడూ ఇలాంటి పాత్రలో ప్రభాస్‌ని చూడలేదు. ప్రస్తుతం ఈ పోస్టర్ నెట్టింట వైరల్‌గా మారింది. హను రాఘవపూడి దర్శకత్వం వహిస్తున్న ఈచిత్రంలో ఇమాన్వి హీరోయిన్‌గా నటించగా.. మిథున్ చక్రవర్తి, అనుపమ్ ఖేర్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్న ఈ చిత్ర బృందం త్వరలోనే షూటింగ్ ముగించుకొని పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో బిజీ కానుంది. ప్రచారంలో భాగంగా మరికొద్ది రోజుల్లో ఈ సినిమా నుంచి ఒక లిరికల్ సాంగ్‌ని విడుదల చేయాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారట.

# అప్పులోళ్లు ఇంటిమీదకు వచ్చేవాళ్లు.. కూలీ పనికి వెళ్లా: విజయ్ సేతుపతి



సినిమా పరిశ్రమలో ఎలాంటి బ్యాక్‌గ్రౌండ్ లేకుండా స్వయంకృషితో ఎదిగిన నటుల్లో తమిళ 'మక్కల్ సెల్వన్' విజయ్ సేతుపతి ఒకరు. కేవలం కోలీవుడ్‌లోనే కాకుండా టాలీవుడ్‌లోనూ తనదైన నటనతో విపరీతమైన అభిమానులను సంపాదించుకున్నారాయన. ఇటీవల జరిగిన ఒక ఇంటర్వ్యూలో విజయ్ సేతుపతి తన బాల్యం, కుటుంబం ఎదుర్కొన్న ఆర్థిక ఇబ్బందుల గురించి వివరించాడు.

**నాన్న పక్కనే కూర్చునేవాడిని**

చిన్నప్పుడు మేము చాలా ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొన్నాం. మా నాన్న మా కోసం చాలా అప్పులు చేశాడు. అవి కట్టేందుకు చాలా ఇబ్బంది పడ్డాం. ఒక్కోసారి అప్పులు కట్టలేదని మా ఇంటిపైకి దాడికి వచ్చేవాళ్లు. ఆ సమయంలో మా నాన్న ఒంటరిగా బాధపడకూడదని నేను ఎప్పుడూ ఆయన పక్కనే కూర్చునేవాడిని. మా నాన్నకు ఒక అలవాటు ఉండేది. ప్రతి రోజు రాత్రి 9.30 గంటలకు బుల్లెట్ బండిపై ఇంటికి వస్తూ.. ఫ్రైడ్ రైస్ తీసుకొచ్చేవాడు. మాతో షేర్ చేసుకొని తినేవాడు. అది నా జీవితంలో మర్చిపోలేని జ్ఞాపకం.


**డబ్బుల కోసం సినిమాల్లోకి వచ్చా**

నటుడు అవ్వాలనేది నా లక్ష్యమే కాదు. కేవలం కుటుంబ బాధ్యతలు, ఆర్థిక అవసరాల కోసమే నేను సినిమాల్లోకి వచ్చా. మొదట్లో సినిమాల్లో నటించడం నచ్చేది కాదు. కష్టపడి పని చేయడం అంటే చాలా ఇష్టం. ఏ పని అయినా సరే గౌరవంగా చేయడం నా అలవాటు. సినిమాల్లోకి రాకముందు దుబాయ్‌లో అకౌంటెంట్‌గా పని చేశా. స్కూల్ ఏజ్‌లో కూలీ పనికి వెళ్లాను. రిటైల్ స్టోర్‌లో సేల్స్‌మ్యాన్‌గా, ఫాస్ట్ ఫుడ్ జాయింట్‌లో క్యాషియర్‌గా, ఫోన్ బూత్ ఆపరేటర్‌గా ఇలా చాలా పనులు ఇష్టంలో చేశాను.

**అలా సినిమాల్లోకి..**

'దుబాయ్ నుంచి ఇండియా తిరిగి వచ్చాక నాటక రంగం వారితో పరిచయం ఏర్పడింది. ఆ అనుభవంతోనే సినిమాల్లో చిన్న చిన్న పాత్రలు చేస్తూ నటుడిగా మారాను'అని విజయ్ చెప్పుకొచ్చాడు. 'తెన్మేర్కు పరువకాట్రు' చిత్రంతో హీరోగా మారిన ఆయన.. ఆ తర్వాత 'సూదు కావ్వుమ్', 'విక్రమ్ వేద' 'మహారాజా' వంటి వైవిధ్యమైన చిత్రాలతో అగ్ర నటుడిగా గుర్తింపు తెచ్చుకున్నారు. ఆయన హీరోగా నటించిన 'ట్రైన్', 'స్లమ్ డాగ్' సినిమాలు విడుదలకు సిద్ధంగా ఉన్నాయి.

# నేను హీరో మెటిరియల్ కాదు.. ఆ సినిమా చేయను అని చెప్పా.. జగపతి బాబు..



తెలుగు సినీ పరిశ్రమలో తనకంటూ ఓ ప్రత్యేక స్థానాన్ని ఏర్పరుచుకున్న నటుడు జగపతిబాబు. ప్రస్తుతం సహాయ నటుడిగా రాణిస్తున్న ఆయన.. ఇప్పుడు ప్రధాన పాత్రలో నటించిన సినిమా వదలా. ఈ మూవీ ప్రమోషన్లలో భాగంగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆయన పలు ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. తాను హీరో మెటీరియల్ కాదంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. హీరో అనే ట్యాగ్‌ను తాను నమ్మనని, సినిమా టైటిల్స్, హీరో ఇమేజ్ వంటి వాటి గురించి లెక్కలు వేసుకోనని ఆయన స్పష్టం చేశారు. "నేను ఎప్పుడూ పెద్ద హీరోని కాను. ఏదో ఇమేజ్ ఉంటుంది, కానీ నా ప్రకారం ఇమేజ్ అనేది ఏమీ కాదు. ఒకే ఇమేజ్‌తో ఎన్ని సినిమాలు చేస్తాం? ఎక్కడో ఆగిపోతాం. అసలు నేను హీరో కాన్సెప్ట్‌ను నమ్మను. హీరో అనేది కేవలం ఒక ట్యాగ్ మాత్రమే. జీవితంలో హీరోగా ఉండాలి కానీ, సినిమాల్లో కాదు" అని జగపతిబాబు అన్నారు. సినిమాల్లో హీరోగా వచ్చిపోయే పాత్రల మాదిరిగానే జీవితంలో సంతోషం, బాధ వంటివి కూడా తాత్కాలికమేనని, అవి వచ్చిపోతుంటాయని చెప్పుకొచ్చారు. తన చిన్నతనం నుంచే అన్నింటినీ వదిలేయడం, సరెండర్ అవ్వడం అలవాటు చేసుకున్నానని జగపతిబాబు పేర్కొన్నారు. "అన్నీ సరెండర్, సరెండర్, సరెండర్, సబ్మిషన్, వదిలేయడమే. ఎందుకంటే దట్ ఈజ్ ద వే లైఫ్ ఈజ్. ఇప్పుడు వదలాలి. ఇప్పుడు హ్యాపీనెస్, శాడ్ నెస్ అన్నీ కూడా టెంపరరీయే. వచ్చి పోయే. ఇవి కూడా అంతే" అని ఆయన తన తత్వాన్ని తెలియజేశారు. హీరోగా కెరీర్ ముగిసిన తర్వాత నెక్స్ట్ ఏమిటి అనే ప్రశ్న తనకు చాలా సింపుల్‌గా మారిందని, తాను పరిశ్రమలోకి రాకముందే ఆ హీరో ట్యాగ్‌ను డ్రాప్ చేశానని తెలిపారు. అయితే, నిర్మాతలు కోరడం వల్ల కొన్ని సినిమాలు చేయాల్సి వచ్చిందని చెప్పారు. ప్రవరాఖ్యుడు సినిమా సమయంలో జరిగిన ఒక సంఘటనను ఆయన వివరించారు. అది 2009 నాటి విషయం అని గుర్తు చేసుకున్నారు. అప్పట్లో తాను రాజరవీంద్రకు చెప్పానని, "నా మీద తొమ్మిది కోట్లు పెట్టి సినిమా చేస్తే అది వర్కౌట్ కాదు. 100% డబ్బులు పోతాయి" అని స్పష్టంగా హెచ్చరించినట్లు పేర్కొన్నారు. అప్పుడు రాజరవీంద్ర, "సార్, మీకు ఉన్న ఒక సినిమా అది. అది కూడా వదులుకుంటారా? డ్రాప్ చేస్తారా?" అని అడిగారని తెలిపారు. అందుకు తాను, "డబ్బులు కూడా పోతాయి కదా? వాట్ ఈజ్ ద పాయింట్? ఎవడో కొన్నప్పుడు ఆ సినిమా డబ్బులు తీసుకున్నప్పుడు అది ఫ్లాప్ కింద లెక్కే కదా?" అని సమాధానం ఇచ్చినట్లు చెప్పారు. అప్పటికే తాను హీరో మెటీరియల్ కానని, ఆ చాప్టర్ ముగిసిందని అంగీకరించానని జగపతిబాబు వెల్లడించారు. గతంలో గుమ్మడి గారు, కాంతారావు వంటి నటుల గురించి ప్రస్తావిస్తూ, ఒకే రకమైన పాత్రలు లేదా ఇమేజ్ వస్తే ఆ ముద్ర పడిపోతుందనే భయం తనలో లేదని జగపతిబాబు స్పష్టం చేశారు. అందుకే, క్యారెక్టర్ రోల్స్, మల్టీస్టారర్లలో నటించడానికి తనకు ఎటువంటి భయం లేదని, "మళ్లీ క్యారెక్టర్ ఇస్తారేమో, హీరో ఇవ్వరేమో" అనే ఆలోచన తనకు లేదని అన్నారు. జీవితం చాలా సింపుల్‌గా ఉంటుందని, దానిని అంతే సింపుల్‌గా చూడాలని అన్నారు.




## మహాప్రభు జగన్నాథ్ సినిమా రిలీజ్‌పై స్టే.. సుప్రీంకోర్టులో శుక్రవారం విచారణ

న్యూఢిల్లీ: ఎలీ యానిమేషన్స్ సంస్థ నిర్మించిన మహాప్రభు జగన్నాథ్ చిత్రాన్ని శుక్రవారం రిలీజ్ చేయాల్సి ఉన్నది. కానీ ఆ ఫిల్మ్ రిలీజ్‌పై ఒడిశా హైకోర్టు స్టే విధించింది. దీన్ని సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో పిటీషన్లు దాఖలు అయ్యాయి. ఈ నేపథ్యంలో ఆ పిటీషన్‌పై శుక్రవారం విచారణ చేపట్టనున్నట్లు సుప్రీంకోర్టు ఇవాళ వెల్లడించింది. చీఫ్ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చీ, వీ మోహనాతో కూడిన ధర్మాసనం ఈ కేసులో అభిప్రాయాన్ని వ్యక్తం చేసింది. తక్షణమే ఈ పిటీషన్‌పై విచారణ చేపట్టాలని సీనియర్ న్యాయవాది దేవదత్ కామత్ కోరారు. యానిమేషన్ ఫిల్మ్‌లో జగన్నాథుడి పాత్రను చిత్రీకరించిన విధానంపై న్యాయ సమీక్ష చేయాల్సిన అవసరం ఉందని ఒడిశా హైకోర్టు తన తీర్పులో చెప్పింది. మహేశ్ కుమార్ సాహూ దాఖలు చేసిన పిల్‌పై హైకోర్టు తాత్కాలిక ఆదేశాలు ఇస్తూ సినిమా రిలీజ్‌పై స్టే విధించింది. పిల్ దాఖలు చేసిన వారిలో పూరి ఆచార్య డాక్టర్ ప్రమోద్ కుమార్, ఉమాశంకర్ ఆచార్య కూడా ఉన్నారు. ఒడిశాలో చిత్ర ప్రదర్శన ఆపేయాలని, ఆ సినిమాకు సీబీఎఫ్‌సీ ఇచ్చిన సర్టిఫికేట్‌ను రద్దు చేయాలని కోరుతూ ఒడిశా కోర్టులో పిటీషన్ వేశారు. చిత్రంలో జగన్నాథుడి బాల్యం, డైలాగ్‌లు, సాహసాలు, యుద్ధ సన్నివేశాలు చూపించిన తీరును తప్పుపట్టారు. ఆ సన్నివేశాలన్నీ స్కంద పురాణం, బ్రహ్మ పురాణం, సనాతన ఆలయ సంప్రదాయాలకు వ్యతిరేకంగా ఉన్నట్లు పిటీషన్‌లో అభ్యంతరాలు తెలిపారు.

PRINTED, PUBLISHED AND OWNER BY B.JAVEED BASHA Printed at M/S Aliya Publication, #7/235 - A Maniyar Street,Near Main Bazar, Tadipatri - 515411,Anantapur District Andra Pradesh, Published at M/S Aliya Publication, #7/235-A Maniyar Street,Near Main Bazar Tadipatri - 515411 ,Anantapur District,Andra Pradesh - 515411 EDITOR B.JAVEED BASHA RNI. NO : APTEL/2022/90211, Cell : 83339 79192 , 83339 75354 , E-mail : akshratimes@gmail.com